


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 139 | ది.2-9-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 139 | Date : 2-9-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |



## సిల్వర్ స్టార్ కెవిఎన్ఆర్ ఘన సన్మానం



**విస్సన్నపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక వాసవి క్లబ్ వారోత్స వాల్లో భాగంగా వాసవి సిల్వర్ స్టార్ కే సి జి ఎం కుక్కడపు వెంకట నాగేశ్వరావును విస్సన్నపేట వాసవి మరియు వనిత క్లబ్ సభ్యులు పట్టు శాలువాతో ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు కుక్కడపు రూపేష్ కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలు గంగిశెట్టి మౌనిక, జోన్ చైర్ పర్సన్ కుక్కడపు శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం



**విస్సన్నపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సూర్యోదయానికి ముందే అత్యంత వైభవంగా మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు సారధ్యంలో లబ్ధిదారు లకు అందించారు. టౌన్ అధ్యక్షుడు కొంగల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు అనుమోలు శివబాజీ తదితరులు పాల్గొన్నారు.

## దిగ్విజయంగా పింఛన్ల పంపిణీ..



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం నుంచి విజయవంతంగా కొనసాగింది. పెన్షన్లు విజయవంతంగా పంపిణీ చేయడం జరిగింది. మిగిలిన లబ్ధిదారులకు కూడా పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో పెన్షన్ అందించేలా అన్ని గ్రామాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టామని తెలిపారు.

## పెడన లో పెన్షన్ లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పెడన మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో సోమ-వారం పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కేవలం ప్రతి నెలా అందించే ఆర్థిక సహాయం మాత్రమే కాదు.. వృద్ధాప్యంలో ఉన్న వారికి జీవన భరోసా.. వితంతువులకు అండ.. దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం.. పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు.. ప్రతి లబ్ధిదారుడు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ భరోసా. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు హన్ను వాహబ్ ఖాన్ యక్కల బసవబెజవాడ నాగరాజు కార్యకర్తలు అధికారులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## సూర్య ప్రకాష్ రాజకీయాలలోకి వస్తే ప్రజలకు మరెన్నో సేవలు చేయొచ్చు : ఎమ్మెల్సీ గోపి మూర్తి



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** సుదీర్ఘ కాలం 34 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా ఉద్యమ నేతగా సమాజ సేవకునిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కొప్పినేడి సూర్య ప్రకాష్ ను ఆయన స్వగృహానికి వెళ్లి శాసనమండలి సభ్యులు శ్రీ బొర్రా గోపి మూర్తి ఆయనను ఘనంగా సత్కరించారు. పని ఒత్తిడి వల్ల సమయం లేక సభకు హాజరు కాలేకపోయానని, సూర్య ప్రకాష్ గారితో సంఘ నేతగా అనేక కార్యక్రమాలలో పాల్గొనడం జరిగినదని, ఉపాధ్యాయ సమస్యలు కోసం పోరాటంలో సూర్య ప్రకాష్ ప్రముఖ పాత్ర పోషించే వారిని అలాగే విద్యార్థుల పట్ల పాఠశాల పట్ల అంకిత భావంతో పనిచేసేవారని ఈ సందర్భంగా ఆయన సూర్య ప్రకాష్ ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్రహం పాకలపాటి సీతారామరాజు పట్టాభి నరసింహా స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రూ.6.25 కోట్లతో గ్రామీణ రహదారుల అభివృద్ధికి శ్రీకారం

● రామచంద్రపురం నియోజకవర్గంలో నాలుగు ప్రధాన రోడ్డులకు శంకుస్థాపన

● కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్





**రామచంద్రపురం/ కె గంగవరం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** రామచంద్రపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్లు కూటమి పార్టీ నాయకులుతో కలిసి మంగళవారం పలు రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొత్తం రూ.6.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నాలుగు ప్రధాన రోడ్డు పనులకు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రోడ్లు అభివృద్ధి చెందితే గ్రామాల ఆర్థిక పురోగతి వేగవంతం అవుతుందని, ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో నియోజకవర్గానికి నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు.

**మంజూరైన రోడ్లు - కేటాయించిన నిధులు..** రామచంద్రపురం మండలంలో కేవిఎఫ్ రోడ్డు నుంచి వెంకటాపాలెం -- గణపతినగరం వరకు రోడ్డు అభివృద్ధి నిధులు- రూ.1.49 కోట్లుతో శంకుస్థాపన చేశారు. కె.గంగవరం మండలంలో ఆర్ & బి రోడ్డు నుంచి కొత్తకొంపలు -- కుదుపూరు సావరం మీదుగా రోడ్డు అభివృద్ధి నిధులు- రూ.1.36 కోట్లు. అలాగే పేకేరు నుంచి పొలమూరుపాడు (దుగ్గుదూరు మీదుగా) రోడ్డు నిధులు: రూ.1.48 కోట్లుతో సత్యవాడ నుంచి కూళ్ల -- నీలగిరిపేట మీదుగా రోడ్డు అభివృద్ధి నిధులు- రూ.1.92 కోట్లు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ స్ట్రెంతనింగ్ ప్రాజెక్ట్ నిధులతో మొత్తం వ్యయం నాలుగు రహదారి పనులకు మొత్తం కేటాయించిన నిధులు రూ.6.25 కోట్లుతో శంకుస్థాపన చేశారు. మంత్రి సుభాష్ ఆదేశాలు మేరకు ప్రారంభమైన ఈ రహదారి పనులు పూర్తయిన అనంతరం రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగుల ప్రయాణాలకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ ప్రాజెక్ట్స్ ఎ రాంబాబు, ఈ ఈ సీతమ్మ నాయుడు, జె ఈ కొండలరావు, జె ఈ యేసు రత్నం, గంగవరం మండలం టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛా ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కర్బ్ స్టోన్స్ ఏర్పాట్లను పరిశీలించిన మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కోనేరు చెరువుకు కర్బ్ స్టోన్స్ తో వాకింగ్ ట్రాక్ కు కొత్త లుక్ వస్తుందని లలితా సూపర్ బజార్ పార్ట్నర్ కే రామకృష్ణ భవిష్యత్తు కాలాలను దృష్టిలో ఉంచుకొని మన్నికైన స్టోన్స్ వినియోగించడం జరుగుతోందని మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు తెలియజేశారు. గుంటూరు జిల్లాలో ప్రత్యేకంగా 64 కిలోలు బరువు కలిగే స్టోన్స్ ఎన్నిక చేయడంలో రవాణా ఖర్చులు గురించి కూడా ఆయన ఆలోచించలేదు అన్నారు. వంద సంవత్సరాల కాలం నుండి కోనేరు చెరువు ఉన్న దీనస్థితిని దుర్గంధ పరిమళాలు వచ్చేవని ఆ వాతావరణాన్ని మారుస్తూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పరిపాలనలో వాకింగ్ మిత్రులకు ఆరోగ్యాన్ని పంచే లక్ష్యంగా జిమ్ సెంటర్ సోలార్ లైట్లు ఫలపుష్ప ఔషధ మొక్కల ఏర్పాటు సీసీ కెమెరాలు సంరక్షణలో సుగంధ పరిమళాలు అందించే లక్ష్యంగా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టడంతో విస్సన్నపేట మండలానికి తలమానికంగా కోనేరు చెరువు చూపరులకు సైతం ఆహ్లాదకర వాతావరణశీ కల్పించడంలో నూటికి నూరు శాతం రామకృష్ణ విజయం సాధించినట్లేనన్నారు. ఉదయం సాయంత్రం వాకింగ్ చేసే వారికి అత్యంత అనువుగా కోనేరు చెరువు వాకింగ్ ట్రాక్ ఉంటుందని వాహనాల పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బంది లేదని సురక్షితమైన జిమ్ పరికరాలు ఆక్సిజన్ అందించే మొక్కలతో నిండిన పార్కు నభూతో నభవిష్యతి అన్న చందంగా మరో వందేళ్లు ఆయురారోగ్యాలను అందించే లక్ష్యంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ఏ మల్లి పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ 8వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ




**తిరువూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** తిరువూరులోని స్థానిక SBI మెయిన్ బ్రాంచ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రీజియన్ సెక్రటరీ బి.ఎల్.హెచ్. ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి, బ్యాంకు ఖాతాదారులకు మరియు శ్రేయోభిలాషులకు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బ్యాంకు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు తమ వంతు సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను యూనియన్ సభ్యులంతా ప్రత్యేకంగా సత్కరించి, వారి సేవలను అభినందించారు.కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ రాజేష్ కుమార్, అకౌంటెంట్ ఫిరోజ్ బేగం, ఫీల్డ్ ఆఫీసర్ హేమ, క్యాషియర్లు ధారవతు శ్రీను, తిరుమల ప్రసాద్, విజయకుమార్ వాణి, బాలకృష్ణారెడ్డి, శ్రావణి, ఆర్మ్డ్ గార్డ్ అప్పలరాజు, నికిత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రీజియన్ సెక్రటరీ ప్రసాద్ మాట్లాడుతూ, యూనియన్ 8వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ సిద్ధాంతాలను సభ్యులంతా తప్పనిసరిగా గౌరవిస్తూ, నియమాలను పాటిస్తూనే మాతృసంస్థ అయిన SBI ను ప్రగతి పథంలో ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. సభ్యులంతా క్రమశిక్షణతో మెలుగుతూ నిత్యం చైతన్యవంతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యూనియన్ సభ్యులకు, మీడియా మిత్రులకు, బ్యాంకు ఖాతాదారులకు సెక్రటరీ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడీ టీచర్ గా అంకిత భావంతో పనిచేసిన సువోశల - వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల





**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లోని హరి గార్డెన్స్ లో అంగన్వాడీ టీచర్ ముంద్ర సువోశల పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని సువోశల ని సన్మానించి వారిని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ రాష్ట్ర నెడ్ కాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అభినందించారు. పెనుగంచిపోలు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, మాజీ జిల్లా పరిషత్ సభ్యురాలు, మాజీ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వేల్పుల పద్మ కుమారి , వారి కుమార్తె హైకోర్టు న్యాయవాది వేల్పుల స్వర్ణ పద్మ తేజ.మండల సమైఖ్య మాజీ అధ్యక్షురాలు కాకాని పద్మ పాల్గొన్నారు.ఈ సందర్భముగా వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ గా సువోశల ఎన్నో సంవత్సరాలనుండి చిన్నారుల సంరక్షణ, విద్యా బోధన, పోషణ లో అంకిత భావంతో సేవలందించడం అభినందనీయమని అన్నారు. చిన్నారుల భవిష్యత్తు కు పునాది వేసి బాధ్య తాయుతమైన సేవలో భాగస్వాములైన అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషి ఎంతో విలువైనదని పేర్కొన్నారు. సువోశల సేవలు ను అభినశీ దిస్తూ పదవీ విరమణ అనంతరం ఆమె ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని వేల్పుల రవికుమార్ ఆకాంక్షిశీచారు.

## ప్లాస్టిక్ రహిత అన్న వితరణ దాతల విలువ వెలకట్టలేనిది

● ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి



**గిద్దలూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమమునందు ప్రతి సోమవారం ప్లాస్టిక్ రహిత అన్న వితరణ దాతల సహాయంతో ఏర్పాటు చేస్తున్న విషయం అందరికీ తెలిసినదే ఈ సోమవారం కాశి నాయనకు ఉదయం అభిషేకాలు చేసి పూలతో అలంకరణ చేసిన తర్వాత పురోహితులు శర్మ స్వామి పూజలు నిర్వహించారు పూజలో పాల్గొన్న భక్తులకు ఈ రోజు కాసా శ్రీనివాస రెడ్డి ధర్మపత్ని పాలుగుళ్ళ అనంత లక్ష్మి వారి కుమారుడు వింగ్ కమాండర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి మరియు డాక్టర్ కృష్ణజ ల వారి పుత్రిక ధాక్షిణ్యా రెడ్డి 2వ జన్మ దినోత్సవ సందర్భంగా అన్న వితరణకు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు వారికి కాశినాయన చిత్రపటం శాలువా పూలమాలతో శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన సేవాశ్రమం తరపున ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు విశ్రాంత సూపర్నెంట్ పాలుగుళ్ల కాశిరెడ్డి విశ్రాంత లెక్చరర్ వడ్డీ వీరారెడ్డి ఏరువ రమణారెడ్డి విశ్రాంత సైనికులు లింగారెడ్డి విశ్రాంత ఆర్టీసీ కంట్రోలర్ వెంకటేశ్వర్ల గౌడ్ విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ రమణారెడ్డి కాశినాయన భక్తులు పాల్గొన్నారు

## తెల్లవారుజాము నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ....



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు పట్టణంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం ఉదయం నుంచి జోరుగా సాగుతోంది.పట్టణంలోని వార్డులో సిబ్బంది కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు,వితంతువులకు,దివ్యాంగులకు పింఛన్లను అందజేస్తున్నారు.పట్టణంలోని తూర్పు బజారు 8 వ వార్డులో అంగన్వాడి టీచర్ దామాల వాణి మండల ప్రెస్ క్లబ్ కార్యదర్శి బోళ్ల రవికుమార్ తో కలసి సీతా రామాలయం సెంటర్ లో పంపిణీ చేశారు..

## సీఎం సార్ మా డబ్బులు మాకు ఇవ్వండి

● నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగులు వినూత్ననిరసన



**విస్సన్నపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఏపీ జెఎసి ఉద్యమంకు మద్దతుగా నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాన్ని రెవెన్యూ ఉద్యోగులు నిర్వహించారు. డిప్యూటీ తాసిల్దార్, ఆర్ ఐ ,వీఆర్వో, వీఆర్ఏ తదితర శ్రేణులు సిబ్బంది పాల్గొన్నారు. సీఎం సార్ మా డబ్బులు మాకు ఇవ్వండి ఏపీ జెఎసి అమరావతి కి మద్దతుగా నల్ల బ్యాడ్జిల్లా నిరసన వ్యక్తం చేశారు. వినూత్నంగా ఒకే చిత్రాన్ని తమ వాట్సాప్ డిస్ప్లే పిక్చర్ డిపి గా పెట్టుకొని ఏపీ జేఏసీ ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నామన్నారు ఒక్క డిపి తో ఐక్యత చాటుకుంటున్నామని హక్కుల కోసం మా స్వరం వినిపించాం ప్రభుత్వానికి ఇచ్చిన హామీలను మరొక్కసారి గుర్తు చేశామన్నారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమం చేరడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** ప్రజల ఆశీర్వాదాలే తమ బలమని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆయన ఆదేశాల మేరకు బాపులపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ టీడీపీ టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 14 వ వార్డు సమస్యలు పరిష్కరించండి

**--మున్సిపల్ సమావేశం లో ప్రజా సమస్యలుపై 14వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత..**



**హుజూర్ నగర్,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** హుజూర్ నగర్ మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా14వ వార్డ్ కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు వార్డులో ఉన్న పలు సమస్యలపై అధికారులకు మరియు చైర్పర్సన్ కి వివరించారు. హుజూర్ నగర్ ఏరియా హాస్పిటల్లో మౌలిక వసతులు కల్పించాలని, స్కానింగ్ సెంటర్ బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ సిబ్బంది కొరత మరియు విష జ్వరాల పై తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ వైద్య అధికారులను దగ్గుపాటి కవిత బాబురావు కోరారు.

## అండర్ 15 ఇయర్స్ జిల్లాస్థాయి స్టాఫ్ బాల్ సెలక్షన్ కు ఎంపికైన లింగారెడ్డి పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు





**కోడూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 15 ఇయర్స్ బాలబాలికల జిల్లా స్థాయి సెలక్షన్స్ అవనిగడ్డ క్రీడా మైదానం నందు ( 31 -8-2026) నిర్వహించారు ఈ జిల్లా స్థాయి సెలక్షన్స్ లో జిల్లా పరిషత్ హై స్కూల్ లింగారెడ్డి పాలెం విద్యార్థులు ఎంపిక అయ్యారని. బాలుర విభాగంలో అద్దంకి జీవన్, బాలికల విభాగంలో కడవకొల్లు బ్లెస్సి జిల్లా జట్టుకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ. శివరామప్రసాద్ అభినందన సభలో తెలిపారు. జిల్లా జట్టుకి ఎంపికైన జీవన్, బ్లెస్సి లను వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల తాతాజి రావును ప్రధానోపాధ్యాయిలు ఎ. శివరామప్రసాద్ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఎ.రాంబాబు మరియు హై స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల తాతాజీరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు సెప్టెంబర్ 11 నుండి 13 వరకు విజయనగరం జిల్లా బొబ్బిలి నందు జరుగుతాయని తెలిపారు.

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

సురేష్ కమ్యూనికేషన్స్ CSC
పాన్ కార్డు, పాస్‌పోర్టు
ఎ.ఎస్.యం రిజిస్ట్రేషన్, & రెన్యూవల్
డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్స్
రైల్వే టికెట్లు బస్ టిక్కెట్లు రిజర్వేషన్
మనీ ట్రాన్స్‌ఫర్, మనీ విత్‌డ్రా
బైక్, కారు, ఆటో, ఇన్సూరెన్స్
ఆర్.టి.ఎ సర్వీసెస్
ఆన్‌లైన్ జాబ్ & ఎగ్జామ్ అప్లికేషన్స్
ఐ.యన్.యం, ఐ.ఎస్స్
లైఫ్ సర్టిఫికెట్లు
డోర్ నెం. 14-5-16, లేపాక్షి ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 03

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 139 | ది.2-9-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 139 | Date : 2-9-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |

# పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం

## నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు
- నదుల అనుసంధానంతో నీటి సమస్యకు పరిష్కారం
- గత పాలకులు బటన్ నొక్కారు.. రోడ్లకు గుంతలు పెట్టారు
- ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది



**నర్సాపురం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.మహిళా సాధికారతకు పెద్దపీట.. డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్..** బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

## రేపు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి జలాలు
- నాలుగు నదుల్ని దాటుకుంటూ.. తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్ష మందికి తాగునీరు అందేలా ప్రణాళిక
- వచ్చే ఏడాది విశాఖ వరకూ..ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం





**అమరావతి,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదారమ్మ ఉత్తరాంధ్రవైపు పరుగులు పెట్టనుంది. నాలుగు నదుల్ని దాటుకుంటూ ... తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి కదలి రానుంది. రేపు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలకు హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. కాలువపై నిర్మించిన రెగ్యులేటర్ ను ఆన్ చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడిచి పెట్టనున్నారు. రేపు మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి.. పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే జలాలకు జల హారతి ఇచ్చి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని సంకల్పం చేసిన సీఎం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నీటిని విడుదల చేయనున్నారు.

**నదులు.. కొండలు దాటుకుని గోదావరి పరుగులు..** ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరనుంది. ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్ల ఖర్చు చేసింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు ఈ జిల్లాల్లో ఉన్న పంపా, తాండవ, వరాహ, శారద నదుల్ని దాటుకుని, ఏలేరు కాలువ, తూర్పు కనుమలపై సంక్లిష్టమైన నిర్మాణాల మీదుగా ఉత్తరాంధ్రకు చేరుకోనున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణంలో భాగంగా వివిధ నదీ ప్రవాహాల వద్ద సైఫన్లు.. అక్విడెక్టులను జలవనరుల శాఖ నిర్మించింది. ఈ నదుల ప్రవాహానికి కొన్ని చోట్ల ఎగువన..ఇంకొన్ని చోట్ల ప్రవాహానికి దిగువ నుంచి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం జరిగింది. ఏలేరు నది బెడ్ లెవల్ కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంపా నది ఎగువ నుంచి అక్విడక్ట్ నిర్మించి పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలకు ఇంజనీర్లు మార్గం సుగమం చేశారు. పంపా నదిపై అక్విడెక్ట్ నిర్మాణానికి 30 మీటర్ల లోతు వం-కు 312 పైల్స్‌తో పునాదుల వేసి అక్విడెక్ట్ ను నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడక్టు నిర్మాణం జరిగింది.

**భవిష్యత్తులో 8 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ..** ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. పాయకరావుపేట అక్విడెక్టు నుంచి సీఎం విడుదల చేయనున్న జలాలు అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక చేసింది.

# ఉత్తరాంధ్ర కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు

- రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పోలవరం ఎడమ కాలువ ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి
- ఎల్ఎంసీతో విశాఖకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రత
- రెండేళ్లలో ఎల్ఎంసీ పనులను పూర్తి చేశాం-మంత్రి నిమ్మల రామానాయుడు



**పాయకరావుపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** ఉత్తరాంధ్ర ప్రజలు గత 20--30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలించే మహత్తర కార్యక్రమం రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం ఎల్ఎంసీ పనుల్లో అనేక క్లిష్టమైన సమస్యలను అధిగమించి ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేసిందన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో ఏలేరు, పంపా, తాండవ, శారద, వరాహా వంటి ఐదు ప్రధాన నదులను దాటుకుంటూ కాలువను నిర్మించామని మంత్రి తెలిపారు. అదేవిధంగా 11 ప్రాంతాల్లో నేషనల్ హైవేలను క్రాస్ చేస్తూ పనులు పూర్తి చేశామన్నారు.

# సమాచార, పౌర సంబదాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్



**హైదరాబాద్,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్‌కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు.అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డి ని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ లో**
ఓ.ఎస్.నెంబర్. 49 / 2022
బిట్వీన్ :
ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ,
రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ. ------వాది
మరియు
1) షేక్ మహమ్మద్ ఖలిద్, S/o మహమ్మద్ అజాం, నివాసం : డోర్ నెం.8-4, Flat No. 407, జయదుర్గ అపార్ట్మెంట్స్,కామయ్యతోపు సెంటర్, యం.జి రోడ్డు, ఇండియన్ బ్యాంకు ఎదురు, కానూరు, పెనమలూరు, కృష్ణా - 520007, ఆంధ్రప్రదేశ్.
2) క్రెస్సెంట్ క్లాతింగ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మ్యానేజింగ్ పార్టనర్, షేక్ మహమ్మద్ ఖలీల్, S/o. మహమ్మద్ ఆజాం, నివాసం : డోర్ నెం.29-27-33ఎ, సూర్య నారాయణ స్ట్రీట్, సూర్యారావుపేట, విజయవాడ - 520002.
------ ప్రతివాదులు
పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదులకు దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.28.09.2026 వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజున ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
**(కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారము)**
వాయిదా తేది : 28.09.2026
ఇట్లు
**కునుకు రాజశేఖర్**
వాది తరపు అడ్వకేట్
గాంధీనగర్, విజయవాడ-520003

**మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్‌లో**
ఓ.ఎస్.నెంబర్. 531 / 2023
బిట్వీన్ :
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ,
రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ. ------వాది
మరియు
జోస్యుల దక్షిణమూర్తి, S/o. జోస్యుల వెంకట సుబ్రహ్మణ్యం, నివాసం : డోర్ నెం. 23-6-50, కొమ్ము వారి స్ట్రీట్, మెయిన్ రోడ్ దగ్గర, సత్యనారాయణపురం, విజయవాడ - 520011, ఆంధ్రప్రదేశ్.
------ప్రతివాది
పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది. 30-09-2026 వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం. 10.30 ని. లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
**(కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారము)**
**వాయిదా తేదీ : 30-09-2026**
ఇట్లు
**కునుకు రాజశేఖర్**
వాది తరపు అడ్వకేట్
గాంధీనగర్, విజయవాడ-520003

**మహారాజశ్రీ నందిగామ మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్ ట్రిబునల్ మరియు గౌరవ 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో**
MVOP : 106/2025
Between:
జల్లి ఎల్విన్‌రాజు
-----పిటిషనర్
And
కుడుపుడి రాంబాబు & వగైరాలు -----రెస్పాండెంట్స్
To
R1 కుడుపుడి రాంబాబు
S/o. శ్రీరాములు
కారు డ్రైవర్ డోర్ నెం. 40-25-17/13, నేతాజీనగర్, విజయవాడ సెంట్రల్, ఎన్టీఆర్ జిల్లా
పై నెంబరు పిటిషన్‌లో మొదటి రెస్పాండెంట్ అయిన మీరు శ్రీ కోర్టు వారి నుండి నోటీసులు పంపితే తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో మీరు కోర్టుకు హాజరు అవుటకు ది.17-9-2026 ఉదయం 10.30ని॥లకు వాయిదా వేసినారు. కావున మీరు ది.17-9-2026 ఉదయం 10.30 గం॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు కాని మీ తరపున న్యాయవాది కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.
**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)**
**వాయిదా తేదీ : 17-9-2026**
ఇట్లు
**నంద్రు శ్రీరామమూర్తి**
న్యాయవాది, నందిగామ
సెల్ : 7702334556

# పేదల ఆత్మగౌరవానికి ఎన్‌టీఆర్ భరోసా!

- అర్హుల ఇంటికే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు
- జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లు
- పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం విజయవాడ అర్బన్ పరిధిలోని 27వ వార్డు బావాజీపేటలో అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు వారి ఇంటి వద్దకే నేరుగా అందించడం ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రతకు భరోసా కల్పిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏ లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందో ఆ లక్ష్యం నెరవేరేలా లబ్ధిదారులు వాటిని ఉపయోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువలో మెరుగైన వైద్య సేవలు

– ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు

- మైలవరంలో రెండు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మైలవరం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఒక్కో కేంద్రానికి రూ.36 లక్షల చొప్పున, మొత్తం 15వ ఆర్థికసంఘం నిధులు రూ.72 లక్షలతో నిర్మించి న రెండు గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాదు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. మైలవరం పట్టణంలోని దేవుడి చెరువు సమీపం లో సూరిబాబు పార్కు పక్కన రూ.36 లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం, అలాగే 6వ వార్డులో పాత మసీదు పక్కన రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన మరో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమ న్నారు.ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రాథమిక వైద్య సేవలు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే అందుబాటు లో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుం టోందని తెలిపారు.ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటే ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా సాధారణ వైద్య సేవలు, ప్రాథమిక చికిత్సలు, తల్లి-శిశు ఆరోగ్య సేవలు మరింత సులభంగా ప్రజలకు అందుతాయని అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పిస్తూ మైలవరం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నా మని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సాయిరెడ్డి పార్టీ... వైసీపీ ఓట్లు చీల్చడమేనా ?

వైసీపీ లో పునాది నుంచి ఉంటూ ఇటీవల బయటకు వచ్చిన మాజె ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీ అంటున్నారు. అయితే ఆయన ఆ మధ్య చెప్పిన జూన్ నెల ముహూర్తం దాటేసింది. ఇక లేటెస్ట్ ఆయన చెప్పిన శ్రావణమాసం మూడో శుక్రవారం కూడా వెళ్ళిపోయింది. అయితే కొత్త ముహూర్తం ఎపుడు అన్నది చూడాల్సి ఉంది. అయినప్పటికీ విజయసాయిరెడ్డి వెనక్కి తగ్గేది ఉండదని కచ్చితంగా కొత్త పార్టీ పెట్టి తీరుతారని అంటున్నారు. మరి విజయసాయి రెడ్డి కొత్త పార్టీ లక్ష్యాలు ఏమిటి అన్నది కూడా ఇదే సందర్భంలో చర్చ వస్తుంది. ఏపీలో ఇప్పటికే అనేక పార్టీలు ఉన్నాయి. వాటి సరసన ఈ పార్టీ చేరుతుందా లేదా ఎంతో కొంత ఉనికి చాటుకుంటుందా అంటే దానికి జవాబు తర్వాత తెలుస్తుంది కానీ టార్గెట్ మాత్రం వైసీపీయే అని అంటున్నారు. విజయసాయిరెడ్డి వైసీపీ మీద ఘాటు విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఆయన తాజాగా రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ జగన్ మత మార్పిడులు ప్రోత్సహించారు అని అతి పెద్ద బండ వేసేశారు. నిజానికి జగన్ ని ప్రత్యర్థులు ఎవరూ ఎపుడూ అనని పెద్ద మాట ఇది. వైసీపీ పెట్టిన తరువాత జగన్ రాజకీయ కెరీర్ లో ఈ తరహా విమర్శలను ఎపుడూ ఎదుర్కోలేదు. దాంతోనే వైసీపీ మీద సాయి రెడ్డి గురి పెట్టారని అంటున్నారు. ఇక హార్డ్ కోర్ హిందూత్వతో ఆయన రావాలని అనుకుంటున్నట్లుగా కూడా ఆయన వ్యాఖ్యల ద్వారా అర్థం అవుతోంది. జగన్ ని వైసీపీని ఎంతగా టార్గెట్ చేస్తే అంతగా తన పార్టీ ఉనికి బలపడుతుందని కూడా వ్యూహం ఏదో ఉన్నట్లుగా చెబుతున్నారు.ఇక వైసీపీకి బలమైన రెడ్డి సామాజిక వర్గం అండ ఉంది. అయితే ఆ వర్గంలో కూడా గతంలో అసంతృప్తి చెలరేగి 2024 ఎన్నికల్లో పూర్తిగా వైసీపీకి ఓట్లు పడలేదని విశ్లేషణలు ఉన్నాయి. కూటమి వైపు ముప్పయి నుంచి నలభై శాతం ఓటు షేర్ మళ్ళింది అని కూడా విశ్లేషించారు. ఇక తాజాగా కొందరు రాజకీయ విశ్లేషకులు కూటమికి అనుకూలంగా ఉండే వారి మాటలలో చూస్తే యాభై శాతం దాకా రెడ్డి సామాజిక వర్గం మద్దతు కూటమికే ఉందని అంటున్నారు. ఆ ప్రకటనల సంగతి పక్కన పెడితే వైసీపీకి హార్డ్ కోర్ ఓటు షేర్ గా ఉంటున్న ఈ బలమైన వర్గంలో చీలిక తెస్తే అది వైసీపీకి భారీ దెబ్బ అవుతుందని కూడా అంటున్నారు. విజయసాయిరెడ్డి గురి కూడా ఈ సామాజిక వర్గం మీద ఉందని కూడా ప్రచారం సాగుతోంది. జగన్ ని కుల పరంగా తమ వాడని సొంతం చేసుకునే రెడ్లలో చీలిక తెచ్చేందుకే ఆయన మీద మత ముద్ర వేశారు అని అంటున్నారు. మత మార్పిళ్లకు జగన్ హయాంలో ప్రోత్సహించారని చెప్పడం ద్వారా బలమైన రెడ్డి సామాజిక వర్గం మీద మతపరంగా పెద్ద విభజన గీత గీయాలని వారిని వేరు చేయాలని చూస్తున్నారు అని అంటున్నారు. నిజానికి వైసీపీకి 2024 ఎన్నికల్లో రెడ్లు పూర్తిగా సహకరించలేదన్నది తెలుసు అని చెబుతున్నారు. ఆ పార్టీ ఈ విషయంలో అంతర్మధనం చెందిన మీదట దగ్గర చేసుకునే ప్రయత్నాలు ఎంత మేరకు చేసింది అన్నది పక్కన పెడితే పార్టీ గ్రాఫ్ పెరిగితే అంతా చక్కబడుతుందని వారు ఎక్కడికి పోరని ధీమాతో ముందుకు సాగుతోంది. అయితే విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పేరుతో వైసీపీని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు. రేపటి రోజున ఆయన మరింత ఘాటుగా ధాటీగా విమర్శలు ఎక్కుపెడితే పార్టీ పెట్టాక ఆయన రాజకీయ జోరు పెంచితే అది కచ్చితంగా ఎంతో కొంత వైసీపీ మీద ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. 2024 ఎన్నికల్లో షర్మిల మూలంగా రాయలసీమలో వైసీపీకి కొంత నష్టం వాటిల్లింది అని గుర్తు చేస్తున్నారు. ఈసారి సాయిరెడ్డి పార్టీ ద్వారా వైసీపీ ఓట్లకు తూట్లు ఎంతో కొంత పడినా ఆ మేరకు నష్టమే అని అంటున్నారు. ఎందుకంటే ఈసారి ఎన్నికలు హోరాహోరీగా ఉంటాయని చెబుతున్నారు. ఏ ఒక్క ఓటు తగ్గినా కూడా అది భారీగానే షాక్ ఇస్తుందని అంటున్నారు.

## పింఛన్ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ల పంపిణీ

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1:(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం అరండల్‌పేట పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పింఛన్ లబ్ధిదారుల ఆధార్ వివరాలను పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా ధృవీకరణ అనంతరం పింఛన్ మొత్తాలను అందజేశారు. పింఛన్ లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రతి నెలా పింఛన్ సకాలంలో అందుతున్నదా, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా, పింఛన్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.అరండల్‌పేట ప్రాంతానికి చెందిన అల్లాడి మీనాక్షి, దొంగర తిరుపతమ్మ, నాగులపల్లి సతీష్, చీమకుర్తి స్వరాజ్యం తదితర పింఛన్ లబ్ధిదారులకు కమిషనర్ ధ్యానచంద్ర స్వయంగా ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా ధృవీకరణ చేసి పింఛన్ మొత్తాలను పంపిణీ చేశారు.పింఛన్ పంపిణీ ప్రక్రియపై లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకున్న కమిషనర్, పింఛన్లు సకాలంలో అందుతున్నాయా, పంపిణీలో ఎటువంటి సమస్యలు ఎదురవుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. లబ్ధిదారులు ప్రతి నెలా పింఛన్ సకాలంలో అందుతున్నదని, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలియజేయడంతో కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో పింఛన్ అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటల వరుకు, సర్కిల్ వన్ పరిధిలో 19,234 పెన్షన్ లకు గాను 17,938, సర్కిల్ 2 పరిధిలో 25,055 పెన్షన్ లకు గాను 23,239, సర్కిల్ 3 పరిధిలో 19,652 పెన్షన్ లకు గాను 18,083, మూడు సర్కిల్స్ పరిధిలో మొత్తం 63,941 పెన్షన్ లకు 59,260 పెన్షన్ల పంపిణీ చేశారని, అంటే దాదాపు 92% పెన్షన్ పంపిణీ చేశారని తెలిపారు.ఈ పర్యటనలో జోనల్ కమీషనర్ కె. ప్రభుదాస్, సీడిఓ జగదేశ్వరి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గంలో పండుగలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**పెన్షన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనపై నేతల ప్రశంసలు**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 52వ డివిజన్ మల్లికార్జునపేటలో 4 పంపుల సెంటర్ ( చంటి వాటర్ ప్లాంట్) సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పెన్షన్లను అందజేసి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై వారు మాట్లాడారు..మల్లికార్జునపేట బుద్ధా వెంకన్న కార్యాలయం వద్ద బుద్ధా వెంకన్న సతీమణి బుద్ధా భూలక్ష్మి చేతులు మీద గా పెన్షన్ అందజేశారు.గద్దె అనురాధ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నెలా సకాలంలో పెన్షన్లు అందిస్తూ వృద్ధుల జీవితాల్లో భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకుంటోందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసా ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. వడ్డెరలతో పాటు అన్ని వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేదల జీవితాల్లో ఆర్థిక స్థిరత్వం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని అన్నారు.ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు ఈగల సాంబ, మాజీ కార్పొరేటర్ ఉమ్మడి చంటి,సాదరబోయిన ఏడుకొండలు గారు,సొలంకి రాజ్, కొప్పుల గంగాధర్ రెడ్డి,అమర మురళి, కుంచం దుర్గ రావు, భవాని ప్రసాద్, పలంటి గంగాధర్, గణప రాము, గంట రాజు, నాగోతి వెంకటేష్, కోసూరు నూక రాజు, మాచార్ల నరసింహారావు, నంగ్లం రాఘవ, బాబురావు, జి రమణ, నాగరాజు, సూరబత్తుల రమేష్,బి. ఈశ్వర్, మోహన్,అనంత లక్ష్మి,మట్టి రోహిణి ప్రియా, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## "సుజనా ఫౌండేషన్" ఆధ్వర్యంలో 26 మంది గర్భిణీలకు ఉచిత వైద్య పరీక్షలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి "సుజనా ఫౌండేషన్" ఆధ్వర్యంలో గర్భిణీల కోసం ప్రారంభించిన ఉచిత మొబైల్ 2డీ ఎకో హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులకు విశేష స్పందన లభిస్తోంది చిట్టినగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వరుసగా నాలుగో మంగళవారం నిర్వహించిన ఈ ఉచిత హెల్త్ స్క్రీనింగ్ లను గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకున్నారు. గర్భధారణ సమయంలో చేసే ఈ వైద్య పరీక్షలు శిశువు పెరుగుదలను పర్యవేక్షిస్తూ తల్లి ఆరోగ్యాన్ని అంచనా వేయడంలో సహాయపడుతున్నాయి. .గర్భిణీలలో గుండె జబ్బులు ముందుగానే గుర్తించి ప్రాణాంతక సమస్యలను నివారించడం సాధ్యమవుతుంది. "సుజనా ఫౌండేషన్" పేద, మధ్య తరగతి మహిళలు , గర్భిణీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఎటువంటి ఖర్చు లేకుండా అత్యాధునిక డయాగ్నస్టిక్ సేవలను అందిస్తుంది..మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ శిబిరంలో 26 మంది గర్భిణీలకు 2డీ ఎకో మాటర్నల్ కార్డియాక్ రిస్క్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.డాక్టర్ విజయ్ సుధా,2 డీ ఏకో టెక్నీషియన్ కుసుమ వైద్య సేవలు అందించి గర్భిణీలు ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది , కూటమి నేతలు నాగోతి రామారావు, వేంపలి గౌరీ శంకర్ తదితరులు ఈ శిబిరంలో సేవలందించారు..

## మహిళల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది

**ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు**

**డాక్టర్ ఇంద్రజ ఆచంట**





**విజయవాడ పశ్చిమ సెప్టెంబరు 1: (వార్త ప్రభ ప్రతినిధి)** మహిళల ఆరోగ్యం వ్యక్తిగత అంశం మాత్రమే కాదని, అది కుటుంబం, సమాజ అభివృద్ధితో ముడిపడి ఉన్న కీలక అంశమని ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఇంద్రజ ఆచంట అన్నారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.కెబిఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం 'కామన్ గైనకాలజికల్ ప్రాబ్లమ్స్ ఇన్ ఉమెన్' అంశంపై విద్యార్థినులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ ఇంద్రజ మాట్లాడుతూ రుతుక్రమ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత, రక్తహీనత, పాలీసిస్టిక్ ఓవరీ సమస్యలు, గర్భాశయ సంబంధిత వ్యాధులపై మహిళలు ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు.మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాలతో మహిళల్లో పలు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. పోషకాహారం, క్రమబద్ధమైన వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు అనేక సమస్యలను ముందుగానే గుర్తించి నియంత్రించేందుకు దోహదపడతాయని వివరించారు. ముఖ్యంగా యువతులు ఆరోగ్యంపై సరైన సమాచారాన్ని తెలుసుకుని అపోహలకు దూరంగా ఉండాలని సూచించారు.సదస్సులో విద్యార్థినులు, మహిళలు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ ఇంద్రజ ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ఉమెన్ స్టడీస్ సెంటర్ సమన్వయకర్త పి. గౌతమీదేవి మాట్లాడుతూ పోషకాహార లోపం వల్ల యువతుల్లో తలెత్తే పలు ఆరోగ్య సమస్యలను సరైన ఆహారంతో నియంత్రించవచ్చన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్య సమస్యలను బయటకు చెప్పకుండా దాచుకోవడం వల్ల అవి తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు. సమస్య అనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించే ధైర్యం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్ స్టడీస్ సెంటర్ సభ్యులు వి.ఎస్. మణి, వనమాదేవి, ఐక్యూఏసీ సమన్వయకర్త షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఏరో స్కేట్‌బాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన చిట్టూరి విద్యాలయం

**బంగారు పతకాలను సాధించిన ఇద్దరు విద్యార్థులు**

**విద్యార్థులను అభినందించిన పాఠశాల యజమాన్యం**




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** నేపాల్‌లోని పోఖ్రా నగరం వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ ఏరో స్కేట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గొల్లపూడి చిట్టూరి విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలను సాధించినట్లు ఆ విద్యాసంస్థ అధ్యక్షులు చిట్టూరి చిట్టూరి ఆనందరామసుధాకర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సామా మణికంఠ చెప్పారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నేపాల్‌లోని పోఖ్రా నగరంలో ఏరో స్కేట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 19, 20, 21 తేదీల్లో అంతర్జాతీయ ఏరో స్కేట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయన్నారు. ఆ పోటీలకు తమ విద్యాసంస్థకు చెందిన అప్పన రాణిభార్గవి, సాలపక్షి చైతీష్‌లు హాజరయ్యారన్నారు. రాణి భార్గవి ఐదు అంశాల్లో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించగా, సాలపక్షి చైతీష్ రెండు అంశాల్లో విజయం సాధించి బంగారు పతకాలను సాధించారని వివరించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు వంద మంది హాజరుకాగా అందులో తమ విద్యార్థులు బంగారు పతకాలను సాధించటం ఆనందంగా ఉందన్నారు. ఇద్దరూ విద్యార్థులు తమ ప్రతిభతో తమ విద్యాసంస్థ ప్రతిష్టను ఇనుమడింపజేశారన్నారు. ప్రధానంగా గొల్లపూడిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా సీబీఎస్ఈ సిలబస్‌తో ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకూ చిట్టూరి విద్యాలయం కొనసాగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో, మంచి క్రీడా ప్రాంగణంతో విద్యార్థులకు అన్ని రకాల అభ్యున్నతికి అండగా ఉండే విధంగా వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరంచారు. అదేవిధంగా విద్యార్థులకు శిక్షణ అందించిన కోచ్ షేక్ ఖాదర్ బాషాకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలిపింది. కోచ్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు కఠోర శిక్షణ పొంది అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. అప్పన రాణిభార్గవి, సాలపక్షి చైతీష్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరెన్నో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ సుధారాణి, కోచ్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ వర్ల రామయ్య ని సత్కరించిన ఎస్పీ శేషగిరిరావు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఏపీ పి.టి.డి(ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పి. శేషగిరిరావు ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల నాయకులు, ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్,ఎమ్మెల్సీ గా వర్ల.రామయ్య నియమితులై, బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ పి.టి.డి విజిలెన్స్ సెక్యూరిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి. అంకినీడు, బీసీ నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, మోజెస్, పి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులదే గెలుపు ఖాయం

**ఖరా ఖండిగా తేల్చి చెప్పిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఖరా ఖండిగా తేల్చి చెప్పారు. వైసీపీ పాలనలో బెదిరించి ఏకగ్రీవంగా కాకుండా ప్రజలు ఎన్నుకోవడం ద్వారానే రాష్ట్రంలో అన్ని స్థానిక సంస్థల్లో కూటమి నాయకులే విజయ దుందుభి మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. చిట్టినగర్ ఈద్గా వెనుక కొండ ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ఉద్యోగులతో పాటు పింఛనుదారులకు కూడా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల దెబ్బతిన్న రాష్ట్ర ఖజానాను గాడిలో పెడుతూనే, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పింఛన్లు ఇస్తున్నామన్నారు. రాబోయే కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ తహశీల్దార్ షేక్ ఇస్మాయిల్, స్థానిక డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ వర్ల రామయ్యను కలిసిన ఎమ్మెల్యే వసంత



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)**తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, శాసనమండలి సభ్యులు వర్ల రామయ్యను మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్యను శాలువాతో సత్కరించి, మైలవరం ప్రత్యేకతను ప్రతిబింబించే కొండపల్లి బొమ్మను జ్ఞాపికగా అందజేశారు. అనంతరం మైలవరం నియోజకవర్గ టీడీపీ నాయకులను వర్ల రామయ్య ఆప్యాయంగా పలకరించారు. సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## స్వామివారిని దర్శించుకున్న కూటమి నాయకులు..



**కృత్తివెన్ను సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం నియౌజకవర్గం ద్రాక్షారామం లో శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భభీమేశ్వరస్వామి వార్లను దర్సించుకున్న కృత్తివెన్ను మండలం తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య ,భస్వాని భరణి బొర్రా రాముడు ,మల్లిపూడి మధు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రాష్ట్రం లో మంచి వర్షాలు కురిసి ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించరు

## ముత్యాల్లాంటి మాటల సరాలు




ఇచ్చిన గౌరవాన్ని
కాపాడుకోవాలి
నచ్చిన సమాజాన్ని
నిర్మించుకోవాలి
మదిలోని గర్వాన్ని
వెంటనే వదలాలి
గుండెల్లో భారాన్ని
ఇక దించుకోవాలి
గుప్పెడంత వినయాన్ని
కాసింత నమ్మకాన్ని
కల్గియుంటే ఘనత
మేలి సంస్కారాన్ని
ఘనమైన సహనాన్ని
బ్రతుకులో శాంతాన్ని
కల్గియుంటే మేలు
ఇల మానవత్వాన్ని

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# బండి వర్సెస్ కొట్టే @ పవన్‌జన్మదిన వేడుకలు!

## కన్ఫ్యూజన్‌లో జనసేన శ్రేణులు.. తర్జనభర్జన పడుతున్న కార్యకర్తలు.





**మచిలీపట్నం సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల వేళ మచిలీపట్నం జనసేనలో విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటివరకు ఒకే వేదికపై కలిసికట్టుగా నిర్వహించే పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఈసారి వేర్వేరు కార్యక్రమాలుగా కనిపించడంతో జనసేన శ్రేణుల్లో అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది.మచిలీపట్నం జనసేనలో బండి రామకృష్ణ, కొట్టే వెంకట్రావు వర్గాలుగా నాయకత్వం విడిపోయిందన్న ప్రచారం వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చేలా వరుసగా రెండు రోజుల పాటు నిర్వహించిన వేర్వేరు విలేకరుల సమావేశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సోమవారం బండి రామకృష్ణ వర్గం విలేకరుల సమావేశం నిర్వహించగా.. మంగళవారం కొట్టే వెంకట్రావు వర్గం మరో విలేకరుల సమావేశం నిర్వహించి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల ఏర్పాట్లను ప్రకటించడం గమనార్హం.ప్రతి ఏడాది మచిలీపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించేవారు. అయితే ఈసారి బండి వర్గం, కొట్టే వెంకట్రావు వర్గం వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కనిపించడంతో అసలు పార్టీ కార్యక్రమం ఏది? ఏ కార్యక్రమానికి హాజరు కావాలి? అనే సందిగ్ధత కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు, వీర మహిళల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది.బుధవారం ఒకవైపు బండి రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుండగా.. మరోవైపు కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దీంతో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాల కార్యక్రమాలుగా మారుతున్నాయన్న చర్చకు తెరలేచింది.కొందరు కార్యకర్తలు ఏ వర్గం కార్యక్రమంలో పాల్గొంటే మరో వర్గం నాయకులకు ఆగ్రహం వస్తుందోనన్న ఆందోళనతో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొందరు మాత్రం ఎటువంటి వివాదాల్లోకి వెళ్లకుండా వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అధినాయకుడి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులన్నింటినీ ఏకం చేయాల్సి ఉండగా.. మచిలీపట్నంలో మాత్రం వేర్వేరు కార్యక్రమాలు తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక నాయకుల మధ్య మచిలీపట్నం మేయర్ పదవి కోసం ఏర్పడిన భేదాభిప్రాయాలు వలనే రెండు వర్గాలుగా విడిపోయి అధినాయకుడు జన్మదిన వేడుకలు రెండు వర్గాలుగా నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.ఏది ఏమైనప్పటికీ ఒకే అధినాయకుడి జన్మదిన వేడుకలను రెండు వర్గాలు వేర్వేరుగా నిర్వహించనున్న పరిస్థితి రావడంతో "ఎవరి కార్యక్రమానికి వెళ్లాలి?" అన్న ప్రశ్న జనసేన శ్రేణులను వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పార్టీ పెద్దలు జనసేన మచిలీపట్నం నాయకుల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను తొలగించి ఏకం చేయకపోతే రానున్న రోజుల్లో మరింతగా బలపడి మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది... రెండు వర్గాల మధ్య బేధాభిప్రాయాలు తొలగించడానికి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆధ్వర్యంలో రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిరించి ఏకం చేయడానికి ప్రయత్నాలు చేసిన జనసేనలో భేదాభిప్రాయం తొలగక పోగా, అధినాయకుడు జన్మదిన వేడుకలు రెండు వర్గాలుగా జరపాలనుకోవడం కోసమెరుపు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు... కొట్టే వెంకట్రావు.



**మచిలీపట్నం సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2న మచిలీపట్నంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లో కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేడుకల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా కొట్టే వెంకట్రావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా భారీగా బైక్, ట్రాక్టర్ల ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేయడంతో పాటు, ఎల్‌ఈడీ వాల్స్‌తో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని, దాదాపు 5 వేల మందికి విందు భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను విజయవంతం చేసేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కొట్టే వెంకట్రావు పిలుపునిచ్చారు. అభిమానులు, కార్యకర్తల భాగస్వామ్యంతో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో జనసేన నాయకులు శివయ్య, పృధ్వి ప్రసన్న , వాలిశెట్టి మల్లి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన ఉండాలి

### వెస్ట్ జోన్ డిసిపి గుణ్ణం రామకృష్ణ




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):** సైబర్ నేరాలపైప్రజలు అవగాహన కలిగి ఉండాలని వెస్ట్ డివిజన్ డీసీపీ జి.రామకృష్ణ తెలిపారు. మండలం పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో పోలీసులు నిర్వహిం చిన 'పల్లెనిద్ర' కార్యక్రమంలో సోమవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సహకరిస్తే పోలీస్ శాఖ మార్పు తీసుకొస్తుందన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలన్నారు.గంజాయి సమాచారం అందిస్తే నగదు బహుమతి అందిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో అనవసర వివాదాలకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.ఏసీపీ దుర్గారావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో నడు చుకోవాలని సూచించారు. ఆన్లైన్ మోసాలు, అపరిచితులతో ఓటీపీలు షేర్ చేయడం వలన కలిగే అనర్థాలు వివరించారు. అనంతరం గ్రామంలోని పల్లెనిద్ర నిర్వహించారు. ప్రజలకు గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ సుబ్ర హ్మణ్యం, ఎస్ఐ సత్యవతి, స్థానికులు పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీ లో కూటమి నాయకులు.



**గన్నవరం , సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ పంపిణీలో భాగంగా ఈ రోజున మన గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు తేలప్రోలు సచివాలయం-2 పరిధిలోని యాదవ బజార్ లో వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేసే కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాల్గొన్న మండల మాజీ అధ్యక్షుడు మరియు తేలప్రోలు సహకార సంఘ చైర్ పర్సన్ డా.ఆరుమళ్ళ వెంకట కృష్ణా రెడ్డి, జైపాల్ రెడ్డి, మనోజ్ రెడ్డి, అయ్యప్ప రెడ్డి, నాగబాబు మరియు కూటమి నాయకులు పాల్గొనడం జరిగింది.

## వర్ల రామయ్యకు ఎమ్మెల్యే వసంత సత్కారం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):**తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, శాసనమండలి సభ్యులు వర్ల రామయ్య ను మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు.వర్ల రామయ్య ను శాలువాతో ఘనంగా సత్కరించారు. మైలవరం ప్రాంత ప్రత్యేకతను ప్రతిబింబించే ప్రసిద్ధ కొండపల్లి బొమ్మను జ్ఞాపికగా అందజేశారు.ఈ సందర్భంగా వర్ల రామయ్య ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తో పాటు మైలవరం నియోజకవర్గ టీడీపీ నాయకులను ఆప్యాయంగా పలకరించారు. పార్టీ కోసం సీనియర్ నాయకులు చేస్తున్న సేవలను కొనియాడుతూ, వారి మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ

- వంద కోట్లతో కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- కొండపల్లిలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం







**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):**అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, త్వరలో కొండపల్లి మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని,కొండపల్లి మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ.2 కోట్ల అంచనా వ్యయంతో వివిధ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.కొండపల్లిలో పుట్టలమ్మ గట్టు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ పాఠశాల మరియు తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం అందించాలనే ఉద్దేశంతో ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు.ఇప్పటికే కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కొండపల్లి మున్సిపాలిటీకి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.46 కోట్ల నిధులు, అదేవిధంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.25 కోట్ల నిధులు, మరోవైపు సీఎం అఫ్ కింద తాజాగా మరో రూ.25 కోట్ల నిధులు మంజూరు అయినట్లు వెల్లడించారు. మరో రూ.4కోట్లు మున్సిపాలిటీలో జనరల్ నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కొండపల్లిలో ఆయా నిధుల వినియోగం కోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.అనంతరం శాంతినగర్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలకు పరిష్కారం లభించనుంది.అలాగే ఆర్.సి.ఎం కాలనీలో పక్కా డ్రైన్లు మరియు వాటర్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి ఇంటికి మెరుగైన తాగునీటి సదుపాయం అందించే దిశగా ఈ పనులు ఉపయోగపడనున్నాయి.ఈలప్రోలు రోడ్డులోని ప్రభుత్వ కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్‌ను కూడా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. కాలనీవాసుల దీర్ఘకాలిక తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం కీలక అడుగుగా నిలుస్తుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలు డి.ఎం.ఎఫ్.టి నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, సి.ఆర్.డి.ఏ గ్రాంట్ మరియు జనరల్ ఫండ్ ద్వారా మొత్తం సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తెలిపారు.కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యా సౌకర్యాలు వంటి మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, వైస్ చైర్మన్ చుట్టుకుదురు, శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు కరిమికొండ బాలాజీ,అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్.ఎస్.కె. లో ఆన్లైన్ మోసానికి బలైన బాధిత రైతులకు న్యాయం చేయండి

### - రెండో రోజు రిలే నిరాహార దీక్షలో పలువురు ప్రముఖులు, వివిధ ప్రజా సంఘాలు మద్దతు



**గన్నవరం, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** సూరంపల్లి రైతు భరోసా కేంద్రం (ఆర్ఎస్‌కే) ద్వారా కౌలు రైతులకు అందాల్సిన నగదు దుర్వినియోగానికి గురవ్వడంతో, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు కొనసాగాయి. మంగళవారం నాటి దీక్షలను గ్రామ మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కైలే ఏసుదాసు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కళ్ళం రాంబాబుతో పాటు పలువురు స్థానిక నాయకులు, రైతులు పాల్గొని దీక్షాపరులకు పూలమాలలు వేసి ప్రారంభించారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సూరంపల్లి ఆర్ఎస్‌కే ద్వారా 11 మంది కౌలు రైతులకు రావాల్సిన రూ. 6.80 లక్షల నగదును అధికారులు దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. కష్టపడి పంటలు పండించే రైతులకు చెందాల్సిన సొమ్మును పక్కదారి పట్టించిన ఆర్ఎస్‌కే అధికారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే బాధితులైన కౌలు రైతులకు ఆ నగదును తక్షణమే చెల్లించి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటిస్తూ పూర్తి సంఘీభావం తెలిపారు.?రెండవ రోజు కొనసాగిన ఈ నిరాహార దీక్షలో బాధిత రైతులు సోమిశెట్టి కాళేశ్వరరావు, నున్నా శంకరరావు, వేల్పూరి వెంకటనాగు తదితరులు పాల్గొన్నారు.

## జీవిత బీమా వారోత్సవాలను ప్రారంభించిన సివిల్ జడ్జి వరలక్ష్మి.



**మచిలీపట్నం సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నంలోని జీవిత బీమా సంస్థ డివిజనల్ కార్యాలయంలో 70వ సంస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవిత బీమా వారోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సంస్థ 70వ సంస్థాపక దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలు, అర్హులైన ప్రజలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, న్యాయ సహాయ కార్యక్రమాల గురించి వివరించారు. న్యాయ సహాయం అవసరమైన వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం జీవిత బీమా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ నున్న నాగేశ్వరరావు సంస్థ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ పాలసీల పరంగా 65.16 శాతం, ప్రీమియం ఆదాయంలో 56.66 శాతం మార్కెట్ వాటాతో జీవిత బీమా వ్యాపారంలో సంస్థ అగ్రస్థానంలో కొనసాగుతోందన్నారు. సంస్థ మొత్తం ఆస్తుల విలువ రూ.57.29 లక్షల కోట్లుగా ఉందని తెలిపారు.జీవిత బీమా వారోత్సవాలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. వివిధ సంఘాల నాయకులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో డివిజనల్ అధికారులు మొహమ్మద్ ఖాజా, ఎం.ఎస్. సుబ్రమణ్యం, కేడీవీఎస్. కృష్ణ, సీహెచ్. వెంకట రమణ, సీనియర్ న్యాయవాది సీహెచ్. ముసలయ్యతో పాటు వివిధ విభాగాల ఉద్యోగులు, ఏజెంట్లు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రతి నెలా సంక్షేమానికి వేలాది కోట్లు.. పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- వంగల్లు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసిన మంత్రి ఆనం
- సంగం మండలంలో సాగునీటి పనులకు రూ.8.75 కోట్లు.. రహదారులకు రూ.12 కోట్లు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**సంగం సెప్టెంబర్ 01 (వార్తాప్రభ ప్రతినిధి)** తల్లికి వందనం నుంచి స్త్రీశక్తి వరకు సంక్షేమ పథకాలకు వేలాది కోట్లు కూటమి ప్రభుత్వం నెరవేర్చింది.సంగం మండలంలోని వంగల్లు గ్రామంలో మంగళవారం పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేయడంతో పాటు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి నెలా 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పండుగ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 61,92,522 మంది లబ్ధిదారులకు రూ.2,694 కోట్ల పింఛన్ మొత్తాన్ని వారి ఇళ్ల వద్దే అందిస్తున్నామని చెప్పారు. నెల్లూరు జిల్లాలో 2,87,970 మంది లబ్ధిదారులకు రూ.126 కోట్ల 14 లక్షల 96 వేల పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.ఆత్మకూరు నియోజకవర్గంలో 36,010 మంది లబ్ధిదారులకు రూ.15 కోట్ల 97 లక్షల 7 వేల 500, సంగం మండలంలో 6,394 మందికి రూ.2 కోట్ల 79 లక్షల 36 వేల 500, వంగల్లు గ్రామంలో 431 మంది లబ్ధిదారులకు రూ.20 లక్షల 4 వేల పింఛన్ మొత్తాన్ని అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**ఆధ్యాత్మిక అభివృద్ధికి పెద్దపీట:** ఆత్మకూరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి, నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి ఆనం తెలిపారు.వంగల్లు గ్రామంలోని పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.40 లక్షలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. సంగం మండలంలో ఇప్పటివరకు 51 దేవాలయాల నిర్మాణానికి రూ.7 కోట్ల 42 లక్షల 30 వేల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరునియోజకవర్గవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 110 ఆలయాల నిర్మాణానికి రూ.40 కోట్ల 20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో పాటు ప్రభుత్వ నిధులతో నిర్మించే మరో 29 ఆలయాలకు రూ.33 కోట్ల 40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ధూపదీప నైవేద్యాల కోసం నియోజకవర్గంలోని 142 ఆలయాలకు రూ.14 లక్షల 20 వేల నిధులు అందించినట్లు వివరించారు.

**సాగునీటి పనులకు రూ.8.75 కోట్లు.. రహదారులకు రూ.12 కోట్లు:**సంగం మండలంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి దాదాపు 120 పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.8 కోట్ల 75 లక్షల విలువైన పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.మండలంలో సుమారు రూ.12 కోట్లతో రహదారి పనులు మంజూరయ్యాయని, కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు.వంగల్లు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రజలు విజ్ఞప్తి చేయడంతో రూ.75 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**వంగల్లు గ్రామానికి నూతన అంగన్వాడీ కేంద్రం**:వంగల్లు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంత్రి ఆనం సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరిన విషయాన్ని గుర్తించి నూతన భవన నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించారు.చిన్నారులు బాలింతలు గర్భిణీలు అంగన్వాడీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని పౌష్టికాహారం పొందాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు.తల్లికి వందనం నుంచి స్త్రీశక్తి వరకు సంక్షేమ పథకాలకు వేలాది కోట్లు ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తూ అభివృద్ధి సంక్షేమాన్ని ముందుకు తీసుకెళు_న్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి దక్కుతుందని మంత్రి ఆనం తెలిపారు.ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లతో పాటు తల్లికి వందనం అన్నదాత సుఖీభవ దీపం గ్యాస్ పథకం స్త్రీ శక్తి తదితర సంక్షేమ కార్యక్రమాల ద్వారా కోట్లాది రూపాయలను ప్రజలకు అందిస్తూ పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి** రాబోయే ఆరు నెలల పాటు ప్రజలు రైతులు అత్యంత జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆనం సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు అవసరమని తెలిపారు.ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని తాగునీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే ఉపయోగించాలని సూచించారు.వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. పంటలకు అవసరమైన నీటిని దశలవారీగా వినియోగిస్తూ నీటి వృథాను నివారించాలని సూచించారు.ధాన్యాన్ని కూడా అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని ప్రతి ఇంట్లో కూడా కొంతమేర ధాన్యం నిల్వలు మన అవసరాలకు ఉపయోగపడేలా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పశువులకు తాగునీరు, మేత విషయంలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. వాతావరణ శాఖ వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేసే సూచనలు హెచ్చరికలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనించాలని మంత్రి సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సాగునీటి ఇబ్బందులు, ఆహార కొరత వంటి పరిస్థితులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజా కుమారి ఆర్డీవో పావని వివిధ శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పల్లెల్లో ప్రతి నెల పండుగ వాతావరణం

### పింఛన్లు పంపిణీలో పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్



**చేజర్ల సెప్టెంబర్ 01 (వార్తాప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సూచనలతో మండల కేంద్రమైన చేజర్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్.సిరాజుద్దీన్ చేజర్ల మండల సొసైటీ అధ్యక్షులు బూదళ్ల వీర రాఘవరెడ్డి చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమవరపు హజరత్తయ్య స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ చెస్ చాంపియన్షిప్ కు కొండపల్లి బాలికలు

### అభినందించిన జంపాల సీతారామయ్య



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):**రాష్ట్రస్థాయి అండర్ 14 చెస్ చాంపియన్షిప్ సాధించి జాతీయ స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించారు కొండపల్లి కి బాలికలు. స్థానిక డిఏవి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బి ఆరాధ్య, షేక్ ఉమ్మే కులుసుం బాను ఆగస్టు 28,29 తేదీలలో విజయనగరం జిల్లా రాజాం పట్నంలో జరిగిన అండర్-14 స్టేట్ టోర్నమెంట్లో విశేష ప్రతిభ తో మొదటి స్థానం సాధించారు. అంతే కాకుండా రాష్ట్రం తరపున ఆడేందుకు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్టేట్ ఫస్ట్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన బాలికలను అభినందించారు. ఆరాధ్య, మరియు కులుసులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదేవిధంగా ప్రతిభ కనిపించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, వారికి ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా అందిస్తానని అభయమిచ్చారు.

## లేఖన సామర్థ్యం పెంపొందుతుంది



**పోడూరు: సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉత్తరాలు రాయడం ద్వారా విద్యార్థులలో లేఖన సామర్థ్యం పెంపొందుట ద్వారా అభ్యసన స్థాయి పెరుగుతుందని కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు. చింతలగరువు పాఠశాలలో మంగళవారం ప్రపంచ లేఖల రచన దినోత్సవం జరిపారు. పోస్టాఫీస్ ద్వారా అందు సేవలను పోస్ట్ మాస్టర్ పైడి శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ కొల్లాబత్తుల సూర్య కుమార్ మాట్లాడుతూ ఆస్ట్రేలియాకు చెందిన రచయిత, ఫొటోగ్రాఫర్ రిచర్డ్ సింప్ కిన్ 2014 సంవత్సరం నుండి ఈ దినోత్సవాన్ని ప్రారంభించారని,విద్యార్థులు లేఖలు రాయడం ద్వారా విద్యార్థులలో లేఖన సామర్థ్యం పెంపొందుతుందని అన్నారు. విద్యార్థులచే లేఖలు రాయించి పోస్ట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏబిపియం కౌరు రాఘవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌కు కొత్త సారథ్యం.. డా. జగదీష్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు



**తిరుపతి: సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) నూతన సంచాలకులు, ఉపకులపతిగా డా. గుడారు జగదీష్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో డా. జగదీష్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. డా. జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో మారుతీ హాస్పిటల్స్, తిరుపతికి చెందిన డా. మారుతీకృష్ణ, ఎలైట్ హాస్పిటల్స్ ఛైర్మన్ డా. కోడూరు బాలసుబ్రమణ్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మాజీ రీజినల్ డైరెక్టర్ వి. పుష్పావతి తదితరులు ఉన్నారు. స్విమ్స్ వంటి ప్రతిష్టాత్మక వైద్య సంస్థకు డైరెక్టర్, ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన డా. జగదీష్‌కు వారు అభినందనలు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు స్విమ్స్‌ను వైద్య, విద్య, పరిశోధన రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని వారు ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాణ్యమైన వైద్య సేవలను మరింత విస్తరించి, స్విమ్స్‌కు, టీటీడీకి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ప్రముఖులు అభిలషించారు. డా. జగదీష్ నాయకత్వంలో స్విమ్స్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):**పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన మాట ప్రకారం ఒక్క రోజు ఆలస్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నామని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. సెప్టెంబర్ మాసానికి సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేడు మంగళవారం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో సెప్టెంబర్ మాసానికి సంబంధించి 42,979 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 18.85 కోట్ల పింఛను సొమ్ము అందజేస్తున్నట్లు తెలిపారు. మైలవరం మండలంలోని 9,370 మందికి రూ. 4.06 కోట్లు, జి.కొండూరు మండలంలో 8,382 మందికి రూ. 3.61 కోట్లు, ఇబ్రహీంపట్నం మండలంలో 4,663 మందికి రూ. 2.01 కోట్లు, రెడ్డిగూడెం మండలంలోని 7,045 మందికి రూ. 3.04 కోట్లు, విజయవాడ రూరల్ మండలంలోని 8,351 మందికి రూ. 3.60 కోట్లు, కొండపల్లి మున్సిపాలిటీలో 5,168 మందికి రూ. 2.29 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మైలవరం నియోజకవర్గంలో ప్రతినెలా 42 వేల మందికి పైగా పింఛన్లు అందజేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక పింఛన్లను పెంచి పేదలకు అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేనన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాలకు పింఛన్ల ద్వారా ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కి లబ్ధిదారులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## వెలుగొండలో ప్రాజెక్టు ప్రారంభంతో సంబరాలు.....

**ముఖ్యమంత్రి చంద్రన్న కు జై జైలు....**

**30 ఏళ్ల కల నెరవేరింది...**

**వెలుగొండలో ప్రజలు రైతులు సంబరాలు జరుపుకున్నారు....**

**టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి పాతర్ల రమేష్....**



**అమరావతి సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో వెలగొండ ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రజలు అభినందనలు తెలుపుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి పాతర్ల రమేష్ అన్నారు అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్లగా ఎదురుచూస్తున్న వెలుగొండ ప్రాజెక్టు కల సహకారం అయిందని ఆయన తెలిపారు చంద్రబాబు దూర దృష్టితో వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేశారని వెలుగొండలో ప్రజలు రైతులు సంబరాలు జరుపుకుంటున్నారని ఆయన అన్నారు నిర్వాసిత కుటుంబాలకు 48 రోజుల్లోనే 752 కోట్లు రూపాయలు పరిహారం పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు సాగునీటి తాగునీటితో ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రైతుల ఆశలు ప్రజల ఆకాంక్షలను ప్రతీక వెలుగొండ ప్రాజెక్టు అని ఆయన కొనియాడారు మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆరోజు రానే వచ్చిందని ఆయన అన్నారు ఎండిపోయిన నేల అడుగంటిన భూగర్భ జలాలు కరువుకాటకు అల్లాడిన కుటుంబాలు ఇక బాధలకు కృష్ణమ్మ జలాలతో చరమగీతం పాడే సమయం వచ్చిందని. అది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందని ఆయన అన్నారు వెలుగొండ రాకతో జిల్లాల్లో వలసలు కష్టాలు తీరనున్నాయని, కరువు నేలపై ఇక సిరుల పంటలు పండనున్నాయని ఆయన అన్నారు 1996 మార్చి 5వ తేదీన చంద్రబాబు శంకుస్థాపన చేసిన వెలుగొండ ప్రాజెక్టును తిరిగి 30 ఏళ్ల తర్వాత చంద్రబాబు చేతుల మీదగా పూర్తిచేసి వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోయిందని ఆయన కొనియాడారు లక్షలాది ఎకరాలకు సాగునీరు తో పాటు లక్షలాదిమంది ఫ్లోరైడ్ లేని స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందుతుందని ఆయన తెలిపారు నల్లమల్ల కొండల్లో 18.8 కిలోమీటర్ల తొవ్విన రెండు స్వరంగాలు దేశంలోని అతి పెద్దవని. శ్రీశైలం నుండి వరద జలాలను మన నల్లమల సాగర్ కు తీసుకొచ్చే అద్భుతమని. అది చంద్రబాబునాయుడుకే సాధ్యమైందని ఆయన అన్నారు వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించటంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం కల్పించిందని ఆయన తెలిపారు ఆ ప్రాంత రైతులు రైతులు ప్రజలు చంద్రబాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు జై జైలు పలుకుతున్నారని పాతర్ల రమేష్ తెలిపారు.

## కొనసాగుతున్న అనధికార నిర్మాణాలపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలు

**36 అనధికార నిర్మాణాలకు నోటీసులు.**

**26 అనధికార నిర్మాణాలు కూల్చివేత.**




**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించిన అధికారులు 36 అనధికార నిర్మాణాలను గుర్తించారు. వీటిలో 26 నిర్మాణాలను కూల్చివేయగా.. 10 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. మరో అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు. జోన్ల వారీగా కూల్చివేతల్లో శేరిలింగంపల్లి జోన్‌లో 8, కూకట్‌పల్లి జోన్‌లో 7, కుత్బుల్లాపూర్ జోన్‌లో 11 నిర్మాణాలను కూల్చివేశారు. మిగిలిన నిర్మాణాలపై నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సీఎంసీ అధికారులు తెలిపారు. అనధికార నిర్మాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు,గుర్తింపు, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణ నిబంధనల అమలులో భాగంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ వెంకటేశ్వర్



**తిరుపతి, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి):**అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి తిరుమల వర్కింగ్ జర్నలిస్ట్ కో--ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, శ్రీవారి ఎలక్ట్రానిక్ మీడియా, తిరుపతి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులు, లబ్ధిదారుల అర్హతలు, అనువైన స్థలాల లభ్యత, కేటాయింపు విధానం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అర్హులైన జర్నలిస్టులకు త్వరితగతిన ఇళ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్టుల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులు, రికార్డులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి అర్బన్, రూరల్ తహశీల్దార్లు జనార్ధన్, సురేష్ బాబు, డీఐపీఆర్ఓ పి. గురుస్వామిశెట్టి, కలెక్టరేట్ అధికారులు, జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం-ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి వివిధ విభాగాలను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలు,ఆసుపత్రిలోని మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలోని ఖాళీ స్థలాలను వినియోగించుకుని పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, ఆసుపత్రి పరిసరాలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అదేవిధంగా, ఆసుపత్రికి వచ్చే రోగులు,వారి సహాయకులు ఇబ్బందులు పడకుండా ఆవరణలో అవసరమైన ప్రాంతాల్లో వెయిటింగ్ హాల్స్ నిర్మించాలని సూచించారు. ఇందుకోసం తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో పాటు,కౌడా నుంచి కూడా అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌడ చైర్మన్ తలాటం సత్య, జనసేన నాయకులు నన్ను దొరబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సుంకర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వావిలేరులో ఉచిత కంటి వైద్య శిబిరం



**చేజర్ల సెప్టెంబర్ 01 (వార్తాప్రభ)** మండలంలోని వావిలేరు గ్రామంలో ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి మెడికవర్ హాస్పిటల్ వారు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వారి ఆధ్వర్యంలో 76 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 18 మందికి కంటి ఆపరేషన్ లు చేయాలని హాస్పిటల్ వైద్య సిబ్బంది ఎం. నక్షత్ర తెలిపారు. అదేవిధంగా 46 మందికి కంటి అద్దాలు కూడా అవసరమని గుర్తించి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే ఆపరేషన్ చేయించుకునే వారు ఆసుపత్రికి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసామని తెలియజేశారు. ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన మండల టిడిపి సీనియర్ నాయకులు మాజీ గ్రామ సర్పంచ్ గోనుగుంట రాంబాబు అనంతనేని బాబు చౌదరి లకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ నవీన్ విమలమ్మ ఎల్వి ప్రసాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం కోఆర్డినేటర్ పి.అనూబ్ బాబు సండి శ్రీనివాసులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పు వ్యవహారంలోనే తనపై దుష్ప్రచారం: డాక్టర్ మాధవి



**తిరుపతి: సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**చంద్రగిరిలోని శివం పాలి క్లినిక్‌కు సంబంధించి ఇటీవల జరుగుతున్న ప్రచారాన్ని డాక్టర్ మాధవి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ, తన జూనియర్, రిపోర్టర్ సురేష్‌కు బాండ్, చెక్కులను ఆధారంగా చేసుకుని చీటీ డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. తాను ఇచ్చిన అప్పును తిరిగి చెల్లించకుండా సురేష్ తప్పించుకుంటున్నాడని ఆరోపించారు. బాకీ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకే తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించినప్పటికీ, ఇది సివిల్ వ్యవహారమని చెప్పి ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీంతో కోర్టును ఆశ్రయించి లీగల్ నోటీసులు పంపినట్లు వెల్లడించారు. నోటీసులు ఇచ్చిన అనంతరం పోలీసుల ద్వారా తనను వేధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తనపై పోలీస్ స్టేషన్‌తో పాటు వివిధ వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎక్కడా ఎంబీబీఎస్ వైద్యురాలినని చెప్పలేదని, తన విద్యార్హతలకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. పీహెచ్‌డీ, ఎంఎస్సీ నర్సింగ్, సైకాలజీ విద్యకు సంబంధించిన ధ్రువపత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. శివం పాలి క్లినిక్‌లో ఎలాంటి సర్జరీలు నిర్వహించడం లేదని, కేవలం ఫస్ట్ ఎయిడ్, కౌన్సెలింగ్ సేవలు మాత్రమే అందిస్తున్నట్లు డాక్టర్ మాధవి పేర్కొన్నారు. పూర్తి వాస్తవాలను తెలుసుకోకుండా తనపై వార్తలు ప్రసారం చేయవద్దని మీడియా ప్రతినిధులను కోరారు. తనపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి చట్టపరమైన మార్గాల్లో వాస్తవాలను నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## సింగ్‌నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగింపునకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా మంగళవారం సర్కిల్--2 పరిధిలోని 60వ వార్డు వాంబే కాలనీ, సింగ్‌నగర్ యార్డ్ రోడ్ ఔట్‌ఫాల్ డ్రెయిన్ ప్రాంతంలో బయాలజిస్ట్ సూర్య నాయక్ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రెయిన్ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం మరియు ఇతర వ్యర్థాలను తొలగించారు. వ్యర్థాల తొలగింపునకు లాంగ్ ఆర్మ్ 245 సీసీ మెకానికల్ యంత్రాన్ని వినియోగించి డ్రెయిన్ పరిసరాలను శుభ్రం చేశారు. డ్రెయిన్‌లలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, డ్రెయిన్‌లలో వేయకుండా నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించాలని సూచించారు. నగరంలో పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వర్షపు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా డ్రెయిన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## తిరువూరులో జయహో బీసీ హోరెత్తింది - ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భారీ బైక్ ర్యాలీ



**తిరువూరు:సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**జయహో బీసీ సందర్భంగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు అయ్యప్ప స్వామి గుడి దగ్గర నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగింది. మార్గమధ్యంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు, బాబు జగజ్జీవన్ రావ్, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు, బీసీ నాయకులతో కలిసి బీసీ మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు. సభలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ...స్వర్గీయ నందమూరి తారకరామారావు బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించారు. ఆయన బాటలోనే చంద్రబాబు నాయుడు కూడా బీసీలకు అండగా నిలుస్తున్నారు. ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటుంది, బీసీలకు అన్ని విధాలుగా ప్రాధాన్యత కల్పిస్తుందని చంద్రబాబు నాయుడు గారు స్పష్టంగా చెప్పారు. రాబోయే రోజుల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయబోతున్నాం. బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించి రాజకీయంగా ముందుకు తీసుకెళ్తాంలి అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు."

## గుడివాడ, 8వ వార్డులో పింఛన్ల పంపిణీ

**-లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే రాము..**



**గుడివాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణం 8వ వార్డు పెద్ద వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ప్రతి లబ్ధిదారుడిని ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేదలకు నెలవారీ భరోసా అని, ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేల పింఛన్ ను ఇంటికే అందిస్తున్నామన్నారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందని, వారికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. గుడివాడ పట్టణంలో ప్రతి వీధిలో రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని, కాళ్లకు మట్టి అంటకుండా రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, లింగం ప్రసాద్, గోర్జీ సత్యనారాయణ, పులపా మహేష్, 8వ వార్డు నాయకులు ఆర్నెపల్లి పాండు, వడ్డాది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల రామబ్రహ్మం మున్సిపల్ పార్క్ పనులు తుది దశకు.. త్వరలో ప్రారంభం..

**-పార్క్‌ను పరిశీలించిన కమిషనర్ ఎస్. మనోహర్..**



**గుడివాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు అభివృద్ధి చేస్తున్న తుమ్మల రామబ్రహ్మం మున్సిపల్ పార్క్ పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ.1.17 కోట్ల జ=ణూా నిధులతో పార్క్‌ను ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, కుటుంబ సభ్యులు సేదతీరేందుకు వీలుగా పచ్చదనం, మౌలిక వసతులు, విద్యుత్ దీపాలతో పార్క్‌ను తీర్చిదిద్దుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ పార్క్‌ను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. పరిశుభ్రత, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. త్వరలోనే పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కమిషనర్ తెలిపారు. ఈ పరిశీలనలో అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి జయంతి వేడుకను వృద్ధులతో పంచుకున్న కుమార్తె

**● బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం, నిత్యావసరాల పంపిణీ..**



**గుడివాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమం. డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ శేగు బబిత తన తండ్రి బైసాని రాధా వెంకటేశం జయంతి సందర్భంగా బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం, నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం వృద్ధుల సమక్షంలో సేవ చేయడం ఎంతో తృప్తినిచ్చిందని, ఆయన ఆశీస్సులు తమ కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయని బబిత భావోద్వేగంతో తెలిపారు. వృద్ధులతో కలిసి భోజనం చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో ఆశ్రమంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ గాదె మోహన్ బాబు, క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్, కార్యదర్శి కంతేటి హరనాథ్ బాబు, కోశాధికారి బచ్చు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళల ముఖాల్లో చిరునవ్వులు పూయించిన రోటరీ క్లబ్..

**-గుడివాడలో 40 మంది నిరుపేదలు, దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ**





**గుడివాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలనే సంకల్పంతో గుడివాడ రోటరీ క్లబ్ మరోసారి మానవత్వాన్ని చాటింది. సోమవారం ఉదయం సత్యనారాయణపురం లోని శ్రీ పుట్టపర్తి సాయిబాబా మందిరం వద్ద 40 మంది నిరుపేద మహిళలు, దివ్యాంగులకు రూ.20 వేల విలువైన నిత్యావసర సరుకుల కిట్లను క్లబ్ సభ్యులు స్వయంగా నిధులు సమకూర్చి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గుళ్లపల్లి కిరణ్ బాబు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు చేయూతనివ్వడమే తమ లక్ష్యమని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే తమ సేవల పరమార్థమని అన్నారు. కార్యదర్శి గండు నరేష్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు రోటేరియన్ సూర్యచంద్రరావు, రోటేరియన్ ముళ్లపూడి రమణమూర్తి తదితర సభ్యులు పాల్గొన్నారు.

# గుడివాడ ఫ్లైఓవర్లపై ఎమ్మెల్యే రాము సమీక్ష

**డిసెంబర్ నాటికి భీమవరం ఫ్లైఓవర్ ఒకవైపు సర్వీస్ రోడ్ సిద్ధం చేయాలి..**



**గుడివాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణంలోని రైల్వే గేట్ల వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ల పనులపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్ష నిర్వహించారు. స్థానిక ప్రజా వేదికలో నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పోలీస్ అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే డీఈ సత్యనారాయణ, ఆర్ అండ్ బి డీఈ కామేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మచిలీపట్నం గేటు వద్ద 70 మీటర్ల మేర పనుల కోసం గేటును తాత్కాలికంగా మూసివేయాల్సి ఉంటుందని వివరించారు. బైపాస్ లో అడ్డంకులను తొలగిస్తామని చెప్పారు. ట్రాఫిక్ ఎస్ఐ పూడి నాగరాజు మాట్లాడుతూ గేటు మూసివేత సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లోకి ట్రాఫిక్ మళ్లిస్తామని తెలిపారు.

**సర్వీస్ రోడ్లు సిద్ధం చేయాలి :** సమీక్షలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ భీమవరం గేటు వద్ద పనులు ప్రారంభించేలోపే సర్వీస్ రోడ్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే, మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డబుల్ లైన్ వచ్చాక గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ కష్టాలు పెరిగాయని, ఫ్లైఓవర్లతోనే దీనికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైల్వే ప్రక్రియలు వేగవంతం చేసేందుకు ఎంపీ వల్లభనేని బాలసౌరి సహకారంతో కృషి చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ నాటికి భీమవరం ఫ్లైఓవర్ ఒకవైపు సర్వీసును అందుబాటులోకి తెస్తామని, తాత్కాలిక ఇబ్బందులను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

## కోడూరు గ్రామంలో పేదల సేవలో 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ

**● ఎన్టీఆర్ భరోసాపెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు**

**● పెన్షన్.. పేదల జీవితాలకు భరోసా కూటమి ప్రభుత్వానికి సంక్షేమమే ప్రాధాన్యత**

**కోడూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** కోడూరు గ్రామంలోఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పాల్గొనిఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన లబ్ధిదారులతో నాయకులు, అధికారులు ఆత్మీయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను విని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కేవలం ప్రతి నెలా అందించే ఆర్థిక సహాయం మాత్రమే కాదు.. వృద్ధాప్యంలో ఉన్న వారికి జీవన భరోసా.. వితంతువులకు అండ.. దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం.. పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు.. ప్రతి లబ్ధిదారుడు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ భరోసా అని బండే శ్రీనివాసరావుతెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,



టిడిపి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

## మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

**మైలవరం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ సబ్జెక్టులను బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సపావటు మాధవి మంగళవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధనకు ఎం.ఎస్సీ. కంప్యూటర్ సైన్స్ లేదా ఎంసీఏ విద్యార్హత, బోటనీ బోధనకు ఎం.ఎస్సి. బోటనీ, కెమిస్ట్రీ బోధనకు



ఎం.ఎస్సి కెమిస్ట్రీ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత పీజీ కోర్సుల్లో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలియజేశారు. అదనంగా నెట్ (టీజు), సెట్ (రాజు) లేదా పీహెచ్.డి. (గ్రాష్ట్ర.ఇ.) అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థు లు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల నకలు కాపీలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల అనగా సెప్టెంబర్ 3 వ తేదీ లోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 08659-299992 నంబరులో సంప్రదించవచ్చని తెలియజేశారు.

## నేత్రదానంతో వెలుగులు నింపవచ్చు: ఏలూరు డిపిఓ డాక్టర్ సునీత





**నూజివీడు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** నేత్రదానం చేయడం వల్ల అంధులకు చూపు ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఏలూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. 41వ నేత్రదాన పక్షోత్సవాల పురస్కరించుకుని నూజివీడులోని గిఫర్డ్ మెమోరియల్ హాస్పిటల్ లో మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గిఫర్డ్ హాస్పిటల్ కాలేజీ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ.. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు వ్యక్తులకు చూపునిచ్చి వారి రూపంలో అమరజీవులుగా నిలవవచ్చని ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు ఈ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీని దిగ్విజయం చేయడానికి సహకరించిన ఏలూరు గిఫర్డ్ మెమోరియల్ హాస్పిటల్ యాజమాన్యానికి, అధికారులకు మరియు సిబ్బందికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ మోజెస్ పెదపూడి, అడ్మినిస్ట్రేటర్ ఎడ్విన్ పాల్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రవి పండాల, కంటి శాస్త్ర చికిత్స వైద్యురాలు డాక్టర్ పి విజయలక్ష్మి, కంటి విభాగం మేనేజర్ దేవదత్తం, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరు పేదలకు మెయిల్ క్రిష్ణారెడ్డి మందుల పంపిణీ...



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రులోని నిరుపేద కుటుంబాల్లో వివిధ రుగ్మతలతో అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నెలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు డోకిపర్రు గ్రామంలో బంగారు కుటుంబాలకు ఈ మందుల సహాయం చేస్తున్నారని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ పేర్కొన్నారు. పి4 ప్రాజెక్ట్‌లో భాగంగా మార్గదర్శి మెయిల్ కంపెనీ సహకారంతో ఏపీఎంఏఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో బంగారు మిత్రలు పాల్గొని కుటుంబ సభ్యులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ సహాయం తమ ఆరోగ్య అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజ సేవలో భాగంగా మెయిల్ క్రిష్ణారెడ్డి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వేనోళ్ల కొనియాడబడుతుంది.

## నూజివీడు పట్టణంలో నేత్రదానంపై లయన్స్ క్లబ్, మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ



**నూజివీడు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలో లయన్స్ క్లబ్ గ్రేటర్, మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో, సిద్ధార్థ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి 41వ జాతీయ నేత్రదాన అవగాహనా పక్షోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నేత్రదానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను పట్టణ ప్రజలకు, విద్యార్థులకు వివరించారు. ప్రమాదాల్లో ప్రాణాలను కోల్పోయిన వారు, ఆకస్మికంగా మృతి చెందినవారి నేత్రాలను దానం చేయడం వల్ల మరి కొంతమందికి దృష్టిని ప్రసాదించవచ్చని లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణప్రసాద్ తెలిపారు. రక్తదానం, నేత్రదానం చేయడం వల్ల ఎందరో ప్రాణాలను కాపాడటంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతతో అవయవ దానం చెయ్యడానికి స్వచ్ఛందంగా ముందుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దీమీ సాయి, షేక్ రఫీ, మారగాని నారాయణ, కాలి సురేష్ బాబు, సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్ రవి బాబు, మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొప్పోలు రంగారావు, నడికట్ల వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రాధా కుమారి, కొంపల్లి అనంతలక్ష్మీ, ఆసుపత్రి అధికారులు సాయి, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు..



**కైకలూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కైకలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు పూజ సామాగ్రిని ఆలయ ఈఓ యార్లగడ్డ వాసు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామలాంబ అమ్మవారి ఆలయ చైర్మన్ జంపన రామలింగరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీ కనక లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ముత్యాల సుందర శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ కృషితో గ్రామస్వరాజ్యం సాకారం

**● వైసీపీ హయాంలో రోడ్లన్నీ విధ్వంసానికి గురయ్యాయి ● వైసీపీ పాలకులు రోడ్లపై చారెడు మట్టి కూడా పోయలేదు ● ఉపాధి, సాస్కి నిధులతో విస్తృతంగా రహదారులను అభివృద్ధి చేస్తున్నాం ● ఎల్-నీనో నేపథ్యంలో రైతు సోదరులు అధైర్యపడవద్దు ● చంద్రబాబు నిర్మించిన పట్టిసీమ ప్రస్తుతం ఆదుకుంటోంది ● నాట్లు వేయని రైతులకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి ● ప్రాజెక్టులకు నీరు వస్తే ప్రభుత్వంతో పోరాడి అయినా సరే నీటిని అందిస్తా ● విశ్వనాధపల్లి, వేణుగోపాలపురం సభల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ● రూ.3.80కోట్లతో విశ్వనాధపల్లిలో 4.60 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం ప్రారంభం ● రూ.2.48కోట్లతో వేణుగోపాలపురంలో 3కి.మీ. రోడ్డు నిర్మాణం ప్రారంభం**

**కోడూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషితో గ్రామ స్వరాజ్యం సాకారం అవుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు మండలంలో సాస్కి నిధులతో నూతన రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. విశ్వనాధపల్లిలో రూ.3.80కోట్లతో నరసింహాపురం వరకూ 4.5కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణ పనులకు పూజలు చేసి ప్రారంభించారు. వేణుగోపాలపురంలో రూ.2.48 కోట్లతో సాలెంపాలెం వరకూ మూడు కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నియోజకవర్గంలో అన్ని ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు విధ్వంసానికి గురయ్యాయన్నారు. వైసీపీ పాలకులు రోడ్లపై చారెడు మట్టి కూడా పోయకపోవటంతో రోడ్లన్నీ గోతులమయంగా మారి, ప్రజలు దుర్భర పరిస్థితి చవిచూశారన్నారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తీర్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండుగ-1 ద్వారా రూ.31.65 కోట్లతో 45.6 కిలోమీటర్ల మేర 462 సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. పల్లె పండుగ-2 ద్వారా 15.30 కిలోమీటర్ల మేర 12 తారు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పవన్ కళ్యాణ్ తెచ్చిన సాస్కి నిధులు రూ.14.57 కోట్లతో 22.30 కిలోమీటర్ల మేర ఆరు తారు రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో సుదీర్ఘ కాలంగా ప్రజలు కోరుకుంటున్న విశ్వనాధపల్లి-



నరసింహాపురం రోడ్డు, సాలెంపాలెం-వేణుగోపాలపురం రోడ్డు నిర్మించటం ద్వారా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చటం సంతోషదాయకం అన్నారు. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఇలాంటి అనేక రహదారులు పవన్ కళ్యాణ్ సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

**రైతులు అధైర్యపడవద్దు-అండగా ఉంటా: ఎమ్మెల్యే..** ఎల్-నీనో నేపథ్యంలో నెలకొన్న నీటి కొరత దృష్ట్యా రైతు సోదరులు ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేనప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా అందిస్తున్న గోదావరి జలాలు కృష్ణా డెల్టా రైతులను ఆదుకుంటున్నాయన్నారు. ప్రకృతి కరుణిస్తుందని వర్షాలు కురుస్తాయని విశ్వాసంతో నాట్లు వేసుకున్న రైతులకు ఎలాంటి నష్టం కలిగినా ప్రభుత్వం పంటల బీమా పథకం ద్వారా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. నాట్లు వేయని రైతులకు కలిగే నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేసేలా ప్రభుత్వంతో పోరాడి న్యాయం చేసేందుకు తాను సదా సిద్ధమని రైతులకు ధైర్యం కలిగించారు. 2002లో తాను అధికార పార్టీలో ఉన్నప్పటికీ, కృష్ణా జలాలను ఆంధ్ర ప్రాంత డెల్టాకు విడుదల చేయటంలో తెలంగాణ అభ్యంతరాల నేపథ్యంలో కృష్ణా డెల్టా పరిరక్షణ ఉద్యమం చేపట్టి డెల్టాను కాపాడుకున్నట్లు తెలిపారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలోనూ సాగునీటి కోసం అవనిగడ్డలో దీక్ష చేయటంతో సీఎం ఫోన్ చేసి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. డిప్యూటీ స్పీకరుగా ఉన్న సమయంలోనూ పట్టిసీమ జలాలను కాలువలో నుంచి అక్రమంగా తోడుతున్న మోటార్లను తొలగింపచేసి నియోజకవర్గ రైతులకు న్యాయం చేసినట్లు తెలిపారు. గత వైసీపీ పాలకులు రైతులకు కనీస భరోసా ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఐదుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటే, వారికి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఆర్థిక సహాయం అందించారన్నారు. వైసీపీ పాలనలో దీనస్థితిలో ఉన్న రైతుల ఆవేదన మీడియాలో చూసి దాతలు సహాయం చేశారన్నారు. ప్రస్తుత ఎల్-నీనో నేపథ్యంలో కృష్ణానదికి నీటి కొరతకు తోడు తీవ్రమైన కరువు వస్తుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్న నేపథ్యంలో ధాన్యం ఉత్పత్తి తగ్గి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతాయనే పరిస్థితి వచ్చిందన్నారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధైర్యం చెప్పారు.

# "మహిళా శక్తి"కి కలెక్టర్ నాగరాణి నిదర్శనం: సీఎం చంద్రబాబు



**మొగల్తూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** మహిళలు ఏ బాధ్యతనైనా సమర్థంగా నిర్వర్తించగలరని నిరూపిస్తూ పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె పురుష కలెక్టర్‌తో సమానంగా సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. మొగల్తూరులో నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి పనితీరును సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, జిల్లా అభివృద్ధి కోసం ఆమె చూపిస్తున్న చొరవ, అంకితభావం, సమర్థత అభినందనీయమన్నారు. మహిళల్లో అపారమైన శక్తి, ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని, వాటిని సరైన విధంగా వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు ప్రజాసేవలో మరింత గొప్ప ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కలెక్టర్ నాగరాణి పనితీరు మహిళా సాధికారతకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమర్థత, అంకితభావంతో పనిచేసే మహిళలు ఎలాంటి కీలక బాధ్యతనైనా విజయవంతంగా నిర్వహించగలరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా కలెక్టర్ పనితీరును ప్రశంసించడంపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ ను అందుకున్న కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**కాకినాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గవర్నర్,రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రతిష్టాత్మకమైన గోల్డు మెడల్ అవార్డును, పురస్కారాన్ని స్వీకరించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణలో కనబరిచిన అత్యుత్తమ ప్రతిభను గుర్తించి ఈ పురస్కారానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఎంపికయ్యారు. సమాజ సేవా కార్యక్రమాలు, రెడ్ క్రాస్ నిర్వహణలో విశేష కృషి చేశారని కాకినాడ జిల్లా కలెక్టర్ ను ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ ఘనత సాధించడం పట్ల కాకినాడ జిల్లా ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు.




# రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించడం పిరికిపంద చర్య-బొర్రా కిరణ్

- మైలవరం బోస్ బొమ్మ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ నేతలతో నిరసన తెలిపిన బొర్రా కిరణ్.



**మైలవరం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై రాజకీయ కక్షసాధింపుతో ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను మరియు ఎఫ్ఐఆర్‌లను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఇది ముమ్మాటికీ పిరికిపంద చర్య అని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ అన్నారు.ఏఐసీసీ మరియు పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశానుసారం మైలవరం బోస్ బొమ్మ సెంటర్ లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులుతో కలిసి బొర్రా కిరణ్ పార్టీ జెండాలు చేతపట్టి మంగళవారం నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా బొర్రా కిరణ్ మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, దేశ ప్రజల గొంతుక రాహుల్ గాంధీ పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరియు దాని అనుబంధ రాష్ట్ర ప్రభుత్వాలు కావాలనే అక్రమ కేసులు, తప్పుడు ఎఫ్ఐఆర్‌లు బనాయిస్తూ రాజకీయ కక్షసాధింపుకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దళితులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ గళమెత్తుతుంటే ఓర్వలేకనే ఈ కుట్రలకు తెరలేపారని అన్నారు.పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన సభా వేదికపై కొందరు అహంకార పూరితంగా చేసిన 'శుద్ధీకరణ' చర్యను ప్రశ్నించినందుకు, దళిత అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేసినందుకు రాహుల్ గాంధీ పై అక్రమంగా కేసులు నమోదు చేయడం దుర్మార్గం అని దుయ్యబట్టారు. దేశంలో రాజ్యాంగాన్ని కాపాడాలని, అణగారిన వర్గాలకు అండగా నిలవాలని చూస్తే కేసులు పెడతారా? ఇదేనా మీ ప్రజాస్వామ్యం? ఘాటుగా ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పై పెట్టిన అన్ని అక్రమ కేసులను, తప్పుడు ఎఫ్ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.నిజమైన దోషులపై చర్యలు తీసుకోవాలని,దళిత సమాజాన్ని అవమానిస్తూ 'శుద్ధీకరణ' వంటి అనాగరిక చర్యలకు పాల్పడిన వారిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి బెదిరింపులకు, తప్పుడు కేసులకు రాహుల్ గాంధీ గానీ, కాంగ్రెస్ కార్యకర్తలు గానీ భయపడ రని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ రాజ్యాంగ విరుద్ధ ప్రయత్నాలపై కాంగ్రెస్ పార్టీ న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ రాజీలేని పోరాటం సాగిస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా తీవ్ర ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శీలం రామకృష్ణ, గొంది సురేష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూరు రవి కుమార్ (సన్నీ), పిట్టల నాగేశ్వరావు,అక్కల ప్రసాద్,రాగాల రాము, చెరుకు ఆనందరావు,మసనం సుధాకర్, సీతారామయ్య,జానీ, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెడనలో ఇంటింటికీ టీడీపీ పాల్గొన్న కాగిత



**పెడన,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పట్టణంలోని 8వ వార్డుల్లో ఘనంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ స్థానిక కూటమి నాయకులు పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సంక్షేమ నిర్ణయాలను కరపత్రాల ద్వారా వివరించారు. అదే సమయంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ మరియు చేనేత కార్మికుడికి రూ.25 వేల ఆర్థిక సహాయం హామీని నెరవేర్చామని పేర్కొన్నారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హత కలిగిన చేనేత కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు హన్ను కమ్మగంటి వెంకటేశ్వరావు వాహబఖాన్ వరుదురామకృష్ణ బసవ నాగరాజు పాల్గొన్నారు.

# బాస్కెట్ బాల్ పోటీలలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

- పతకం సాధించిన కందుల రాజేష్ ను అభినందించిన డైరెక్టర్ డాక్టర్ నాయుడు

**కాకినాడ,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బి బి ఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కందుల రాజేష్ బాస్కెట్ బాల్ పోటీలలో పతకం సాధించాడని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఇటీవల తిరుపతిలో స్టేట్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా జరిగాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలలో కాకినాడ క్రీడా సాధికార ప్రాంగణంలో డీఎస్ఏ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.50వేల నగదు బహుమతి గెలుచుకుంది. జట్టులో చక్కని ప్రతిభ కనబరచిన ఆదిత్య డిగ్రీ కళాశాలలో బి బి ఏ చదువుతున్న కందుల రాజేష్ ను డైరెక్టర్ డాక్టర్ నాయుడు, ప్రిన్సిపాల్ మహమ్మద్ షాహిద్దీన్ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, తరువాత జరగబోయే పోటీలలో రాజేష్ చక్కని ప్రతిభ కనబరిచి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. బాస్కెట్బాల్ క్రీడాకారుడు కందుల రాజేష్ ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జె. గణేష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి టి. తేజేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.




# బందరుకోట శ్రీ కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా రుద్రాక్షార్చన -- సిందూరార్చన



**మచిలీపట్నం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా వారి సహకారంతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు బందరుకోటలోని శ్రీ కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో రుద్రాక్షార్చన -- సిందూరార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొ-్తం 106 మంది మహిళా భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు శివనామస్మరణల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. మహిళలు సామూహికంగా పాల్గొని దైవభక్తి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రదర్శించారు. భగవంతుని పట్ల భక్తి కలిగి ఉండటంతో పాటు మన మాతృభూమి పట్ల ప్రేమ, గౌరవం మరియు బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలుగా మాత్రమే కాకుండా, సమాజంలో సనాతన ధర్మం, నైతిక విలువలు, సామాజిక ఐక్యత మరియు దేశభక్తిని పెంపొందించే చైతన్య కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. . ఈ సందర్భంగా భక్తులు దేశ ఐక్యత, సమగ్రత మరియు శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూనపురెడ్డి శ్రీనివాసరావు దూళిపాల రాము హరికృష్ణ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం ఆలయ చైర్మన్ బచ్చుల హరీష్ ఆలయ ఈఓ కొండవీటి మురళీకృష్ణ, ఆలయ ధర్మకర్తలు బచ్చుల శ్రీనివాసరావు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ మరియు జిల్లా ప్రభారి పీవీఎస్ నాయుడు అభినందించారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన 106 మంది మహిళా భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దైవభక్తి మనిషికి ఆధ్యాత్మిక శక్తినిస్తే, దేశభక్తి సమాజానికి మరియు దేశానికి సేవ చేసే స్ఫూర్తినిస్తుంది. ఈ రెండు విలువలు కలిసినప్పుడే సుసంస్కృతమైన బాధ్యతాయుతమైన మరియు శక్తివంతమైన భారత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

# రైతులందరికి ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి - జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల దేవి

- జి.కొండూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న డిఏవొ







**జి.కొండూరు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** రైతులందరికీ ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి సిహెచ్.తిరుమల దేవి వెల్లడించారు. జి.కొండూరు మండల వ్యవసాయ అధికారి కె సిహెచ్ సూరిబాబు ఆధ్వర్యంలో మంగళవా రం నిర్వహించిన పొలం పిలుస్తు ంది కార్యక్రమం లో డిఏవొ తిరుమల దేవి పాల్గొన్నారు.జి. కొండూరు పిఎసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డిఏవొ రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ముఖ్యంగా ప్రత్తిలో ప్రస్తుత పరిస్థితుల్లో రసం పీల్చే పురుగులు నివారణకు తీయోమెతోక్సమ్ అనే ముందును 60 గ్రాములు ఎకరానికి 150 లీటర్ల నీటిలో పిచికారి చేయాలని సూచించారు.అలాగే ఇమిడాక్లోప్రైడ్ 50 మిల్లీలీటర్లు ముందును 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసినట్లైతే రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చు అని తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రత్తిలో 13-0-45 అనే మందు ఎకరానికి ఒక కిలో లేదా 19-19-19 ముందు ని ఎకరానికి ఒక కిలో చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించా రు.అనంతరం క్షేత్ర స్థాయిలో ప్రత్తి పంట ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏడిఏ ఎం.శ్రీనివాసరావు, సొసైటీ ప్రెసిడెంట్ పజ్జూరు శ్రీనివాసరావు, వుయ్యూరు నరసింహారావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయ్, రైతులు పాల్గొన్నా రు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు శ్రీకారం



**విస్సన్నపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో జగన్నాథుడైన శ్రీకృష్ణుని విగ్రహ పూజా కార్యక్రమాలు శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా ప్రారంభించారు. లింగాభిషేకములకు భక్తులకు ఆవుపాలు కమిటీ అందించింది. వేద పండితుల నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత సమాజం కోసం డ్రోన్ ద్వారా అవగాహన కార్యక్రమం



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలంలో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డ్రోన్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డీసీపీ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గంజాయి విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే పోలీస్ శాఖకు వెంటనే తెలియజేయాలని కోరారు.మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన యువత సురక్షితమైన సమాజం కోసం కృషి చేయాలని తెలి పారు. అలాగే పోలీసులతో కలిసి గంజాయి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనీ తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎస్. ఐ అర్జున్, ఎస్ ఐ -2 నాగేశ్వర రావు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు..

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ....



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దయాకర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెదతుమ్మిడి నీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పి హెచ్ సి లోని అన్ని రికార్డులు తనిఖీ చేయడం జరిగింది.ఓపి రిజిస్టర్, ఫార్మసీ రికార్డు, వాక్సిన్ రికార్డు, కోల్డ్ చైన్ సిస్టమ్, లాబ్ రికార్డులు తనిఖీ చేయడం జరిగింది అటెండెన్స్ రిజిస్టర్ చెక్ చేశారు. రికార్డులు అన్ని సరిగా మెయింటెన్స్ చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. పి హెచ్ సి కి వచ్చిన ప్రజలుకు మంచి వైద్యం అందించాలని చూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలోవైద్యాధికారి డ్రా కె.సువర్చల డ్రా.వి జయశ్రీ, ఎం ఏడు కొండల రావు ఎం పి హెచ్ ఈ ఓ సూపర్ వైజర్ ఎం యేసు దాసు, పెద్దీస్వరి పి హెచ్ ఎన్ హెల్త్ అసిస్టెంట్ బి రాజారావు స్టాఫ్ నర్స్ చాన్ బీ, ఎల్ టి ప్రసాద్ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేసిన టిడిపి సీనియర్ లీడర్ నెక్కలపు శ్రీనివాసరావు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొర్లమండ గ్రామంలో తిరువూరు నియోజవర్గ టిడిపి సీనియర్ లీడర్ నెక్కలపు శ్రీనివాసరావు (ఎన్టీవీ ప్రసాద్) ఎన్టీఆర్ భరోసా పంపిణీ చేశారు. విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు ఆంధ్రప్రదేశ్ ను అత్యున్నత శిఖరాలను అధిరోహింప చేస్తాయన్నారు.

# కుడుపూడి చిట్టబ్బాయి సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్సీ కుడుపూడి

- 78వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన వైసీపీ నాయకులు, అభిమానులు ..

**అమలాపురం,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ) :** అమలాపురం మాజీ శాసనసభ్యులు, స్వర్గీయ కుడుపూడి చిట్టబ్బాయి 78వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అమలాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణ రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గా కుడుపూడి చిట్టబ్బాయి అమలాపురం నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం పనిచేసిన ప్రజానాయకుడని అన్నారు. సామాన్య ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన ఆయన సేవలు అమలాపురం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.. మాజీ ఎంపి చింతా అనురాధ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్, నేతలు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, పితాని బాలకృష్ణ , ఎస్ఈసీ సభ్యులు కుడుపూడి భరత్ భూషణ్,రెడ్డి సత్య నాగేంద్ర మని,చెల్లుబోయిన శ్రీనివాస్,కుడుపూడి బాబు, వంటెద్దు వెంకన్నాయుడు, పట్టణ అధ్యక్షులు సంసాని నాని, కొనుకు బాపూజీ, పందిరి శ్రీహరి, కొనుకు గౌతమి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర, మోటూరి సత్యం కాపు, గుత్తుల రాజు, సరేళ్ళ రామకృష్ణ, గొవ్వాల రాజేష్, తోరం గౌతం రాజా, సూదా గణపతి,దంగేటి రుద్ర, గుత్తుల సత్తిబాబు, జన గణేష్, సంసాని శంభూ ప్రసాద్, విత్తనాల మూర్తి తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుడుపూడి చిట్టబ్బాయి చిత్రపటానికి, విగ్రహానికి నివాళులర్పించారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

## ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-బి.ఆర్.ఎస్.నాయకులు**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ):**కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.గచ్చిబౌలిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు,మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను వివరిస్తూ 'కాంగ్రెస్ బాకీ కార్డు' పేరుతో గోడపత్రికలను ప్రదర్శించారు.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వచ్చే 10 రోజులు పాటు కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు తెలిపారు.ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలి

**-ఏ ఎల్ వొ లేబర్ ఆఫీసర్ వరహాలబాబు**



**మైలవరం సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి):**భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకుని సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని ఏ ఎల్ వొ లేబర్ ఆఫీసర్ వరహాలబాబు అన్నారు.స్థానిక కోర్టు సమీపంలోని వినాయక కమ్యూనిటీ హాల్లో ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం సమావేశం అయ్యారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తిరువూరు లేబర్ ఆఫీసర్ వరహాలబాబు హాజరయ్యారు.బీసీ డబ్ల్యూ యు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో వరహాలబాబు మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఈ అవకాశాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మికులు క్లెయిములు, నష్టపరిహారాలు అమలు చేస్తున్నారని కార్మికులు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అలాగే కొత్త కార్డుల కోసం అప్లై చేసుకోవాలని సూచించారు.ఇంతకుముందు బ్యాంకు దగ్గరికి వెళ్లి డిడి కట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది, ఇప్పుడు కార్మికులు నేరుగా లేబర్ ఆఫీసు వద్దకు వెళ్లి ఆన్లైన్ చేసుకోవచ్చు అని తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల కుమార్ మాట్లాడుతూ 1996 కేంద్ర చట్టం అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయవలసిన పరిస్థితుల్లో ఏపీ కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా సంక్షేమ బోర్డులో పథకాలన్నీ అమలు చేయకుండా కేవలం నాలుగు పథకాలు మాత్రమే అమలు చేసి చేతులు దులుపుకున్నారు పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 36 లక్షల భవననిర్మాణ కుటుంబాలు ఉన్నాయని,వీరందరికీ కూడా సంక్షేమ పథకాలు అమలు చేసి పెండింగ్ క్లైములు వెంటనే విడుదల చేయాలని కోరారు.ముఖ్యంగా ప్రమాదం వలన మృతి చెందిన కుటుంబానికి పథకం లేదని,ఆ పథకాన్ని కూడా అమలు చేసి మరణించిన కుటుంబానికి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని,వెల్ఫేర్ బోర్డు కార్డు జీవితకాలం కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనంతరం మైలవరం భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .సంఘం అధ్యక్షులుగా కృష్ణ పాపారావు,ఉపాధ్యక్షులుగా గంధం సిరి, ప్రధాన కార్యదర్శి నల్లబోతుల చెన్నారావు, ముత్యాల జమలయ్య,గోపి లతో పాటు సహాయ కార్యదర్శిగా భోగ్యం గోపాలకృష్ణ, కోశాధికారిగా నల్లపోతుల రమేష్ కార్యవర్గ సభ్యులుగా కుంచెం దుర్గారావు, కుంకాల శేఖర్,భోగ్యం రాఘవ, కృష్ణ శేషగిరి లను లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మొత్తం 11 మందితో నూతన కార్యవర్గం ఏర్పడింది.ఈ కార్యక్రమంలో కోనేరు ఆంజనేయులు, బీసీ డబ్ల్యూ యు జిల్లా నాయకులు దుర్గారావు సిరి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సమాచారం ఇస్తే బహుమతి: ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)**గంజాయి అక్రమ రవాణా,విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం అందించి సమాజ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో రైజ్ ఎగైనెస్టు గంజా పేరుతో విద్యార్థులు, యువత, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా




ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతోపాటు కుటుంబ,సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులు, విద్యార్థులు,యువత, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. 'రైజ్ ఎగైనెస్టు గంజా' పోస్టర్‌ను విడుదల చేశారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, విలువైన సమాచారం అందించిన వారికి తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు. గంజాయి సమాచారం కోసం 1972, అత్యవసర పోలీసు సేవల కోసం 112, కాకినాడ పోలీసు వాట్సాప్ నంబర్ 9494933233కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు,స్థానిక ప్రజలు,పోలీసు అధికారులు గంజాయి,ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, వాటి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, వివిధ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు,ఎస్సైలు, మెడికవర్ హాస్పిటల్ సుకుమార్,పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు,స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో "యాదవ సంఘం భవన్" నిర్మాణానికి రూ.3 కోట్లు

**ప్రతి మండల కేంద్రంలో యాదవ సంఘం భవనాలు నిర్మిస్తా - ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి**



**షాద్ నగర్, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** యాదవ సోదరులకు అండగా నిలుస్తూ షాద్‌నగర్ తాలూకాలోని ప్రతి మండల కేంద్రంలో యాదవ భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కేశంపేట్ మండలం వేములనర్వ గ్రామంలో హై మాస్ట్ లైట్ల ప్రారంభోత్సవానికి హాజరై అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ తాలూకా యాదవ సోదరులకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి శుభవార్త ప్రకటించారు. షాద్‌నగర్ పట్టణంలో యాదవ భవన్ నిర్మాణం కోసం సుమారు 600 గజాల స్థలాన్ని రఘునాథ్ యాదవ్ తన సొంత భూమిని ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఆ స్థలంలో యాదవ భవన్ నిర్మాణానికి రూ.3 కోట్లను తన సొంత నిధులతో సమకూర్చి భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా షాద్‌నగర్ తాలూకాలోని ప్రతి మండల హెడ్‌క్వార్టర్‌లో యాదవ సోదరుల కోసం యాదవ భవనాలను నిర్మించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ ప్రకటించారు. యాదవుల సంక్షేమం, అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు.ఎమ్మెల్సీ ప్రకటనతో యాదవ సోదరులు హర్షం వ్యక్తం చేశారు. సభలో యాదవ సోదరులు, గ్రామస్తులు యువకులు చప్పట్లు కొడుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. యాదవ భవనాల నిర్మాణంతో సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. మరియు నియోజకవర్గంలో ప్రతి కులానికి సొంత నిధులతో భవనాలు నిర్మిస్తానని తెలిపారు. వేముల నర్వ గ్రామంలో గుడి స్కూల్ మజిద్ కట్టించటానికి బాధ్యత నాదే అని అన్నారు. ప్రతి గ్రామంలో సొంత నిధులతో ఐ మాస్ట్ లైట్లు నిర్మిస్తున్నానని తెలిపారు. యువత అక్క చెల్లెలు అన్న తమ్ముళ్ల మేలుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యన్. రఘునాథ్ యాదవ్, వేములనర్వ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నర్సిములు, కేశంపేట్ సర్పంచ్ బొజ్జం సంతోష, శ్రీశైలం యాదవ్, పోమాల్‌పల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల కోసం పోరాటం ఉధృతం చేస్తాం: బీజేపీ

- ఐడీపీఎల్ చౌరస్తా వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన దీక్ష
- రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 1, (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్రంలోని 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" పేరిట ఒకరోజు నిరసన దీక్ష నిర్వహించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి నేతృత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తా వద్ద ఈ దీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు అందాల్సిన రూ. 15 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల కాకుండా పెండింగ్‌లో ఉండటం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడటం మానుకోవాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేంత వరకు బీజేపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్షలో గిరివర్ధన్ రెడ్డితో పాటు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్, వేణు, మహిళా నాయకురాళ్లు విజయలక్ష్మి, మాధురి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ నందనం దివాకర్, పార్లమెంట్ మాజీ కన్వీనర్ ఆర్.కే. శ్రీనివాస్, ఉప్పల్ కన్వీనర్ గోపాల్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, నాయకులు రాజా సదానందం, కృష్ణారెడ్డి, కట్టా కుమార్, డివిజన్ అధ్యక్షులు హాజరై తమ పూర్తి మద్దతును ప్రకటించారు. పెండింగ్ ఫీజులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్, నాయకులు శ్యామ్, పృథ్వి, ఆదిత్య డిమాండ్ చేశారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ చంద్రబాబు సంకల్పానికి ప్రతీక

**- రాయలసీమ, ప్రకాశం ప్రజలపై ఆయనకున్న ప్రేమకు నిదర్శనం: గొల్ల నరసింహ యాదవ్**



**తిరుపతి, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** వెలిగొండ ప్రాజెక్ట్ కేవలం నీటి పారుదల ప్రాజెక్ట్ మాత్రమే కాదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సంకల్పశక్తి, పట్టుదలకు, రాయలసీమ, ప్రకాశం జిల్లాల ప్రజలపై ఆయనకున్న ప్రేమకు ప్రతీక అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెలిగొండ ప్రాజెక్ట్ ప్రాధాన్యతను వివరించారు.ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల సాకారమైన చారిత్రక దినమిదని ఆయన పేర్కొన్నారు. 1996లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ సంకల్పంతో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ఆ లక్ష్యాన్ని సాధించి చూపించిందన్నారు.కరువు కోరల్లో చిక్కుకున్న పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి కృష్ణా జలాలను అందించాలనే దృఢ సంకల్పం, విజనరీ నాయకత్వం చంద్రబాబు నాయుడికే సాధ్యమైందని నరసింహ యాదవ్ అన్నారు. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు తొలి దశ పనులను పూర్తి చేసి, ఆగస్టు 31న సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు.శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నల్లమల సొరంగాల మీదుగా గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలు నల్లమల సాగర్‌కు చేరుతున్నాయని తెలిపారు. తొలి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న సుమారు నాలుగు లక్షల మందికి తాగునీరు అందనున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వస్తే సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీటి భరోసా కలుగుతుందన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారని తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, రూ.700 కోట్లకు పైగా పరిహారం విడుదల చేసిందన్నారు.వెలిగొండ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో కరువు ఛాయలు తొలగి, పశ్చిమ ప్రకాశం సస్యశ్యామలంగా మారుతుందని నరసింహ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కేవలం నీటి ప్రాజెక్ట్ కాదని, లక్షలాది ప్రజల జీవితాలను మార్చే మహాయజ్ఞమని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు

**కానూరులో భారీ కటౌట్ ఆవిష్కరణ.. 'పంజా' రీ-రిలీజ్ పోస్టర్ విడుదల**

**భారీ బైక్ ర్యాలీతో కదం తొక్కిన జనసేన యువత**



**కానూరు సెప్టెంబర్ 1(వార్తా ప్రభ, ప్రతినిధి)**తాడిగడప మున్సిపాలిటీ,కానూరు జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు పెనమలూరు నియోజకవర్గంలో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకుడు బొల్లం వీరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత భారీగా తరలివచ్చారు.తాడిగడప సెంటర్ నుంచి ప్రారంభమైన భారీ బైక్, యువజన ర్యాలీ వి.ఆర్. సిద్ధార్థ కాలేజీ, పి.వి.పి మీదుగా కానూరు విజయలక్ష్మి థియేటర్ వరకు సాగింది. ర్యాలీ పొడవునా జనసేన జెండాలు రెపరెపలాడగా, పవన్ కళ్యాణ్ నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.అనంతరం కానూరు విజయలక్ష్మి థియేటర్ వద్ద పవన్ కళ్యాణ్ భారీ కటౌట్‌ను ఆవిష్కరించారు. పవన్ కళ్యాణ్ నటించిన 'పంజా' చిత్రం రీ-రిలీజ్ సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అనంతరం నియోజకవర్గం జనసేన నాయకులు బొల్లం వీరన్, మేక స్వాతి మాట్లాడుతూ.రాజకీయాల్లో యువత మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని జనసేన నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజాన్ని అర్థం చేసుకుని, సిద్ధాంతాలతో రాజకీయాల్లోకి వచ్చి మార్పుకు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.యువతను నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్న జనసేన యువజన విభాగం ప్రక్రియకు ఈ ముందస్తు జన్మదిన వేడుకలు ఒక ట్రైలర్ మాత్రమేనని నాయకులు పేర్కొన్నారు.గత 12 ఏళ్లుగా పెనమలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న మీడియా మిత్రులకు, స్థానిక ప్రజలకు నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యలపై స్పందిస్తూ, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరి సహకారాన్ని వారు గుర్తు చేసుకున్నారు. భవిష్యత్‌లోనూ ప్రజలతో మమేకమై మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎల్.ఓ.లకు ఎస్.ఐ.ఆర్.నోటీసుల జారీ పై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వండి.

**- సమీక్షా సమావేశంలో అధికారులను కోరిన నాయకులు**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 1 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఎస్ఐఆర్ నోటీసుల జారీపై జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.డిప్యూటీ కమిషనర్లు సేవా ఇస్లావత్, బాలకృష్ణ,చాముండేశ్వరి, కొండాపూర్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు,ఓటర్లు, ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నోటీసుల జారీలో ఎదురవుతున్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.చిరునామా మారిన ఓటర్లకు పాత చిరునామాలో నోటీసులు రావడం,వలస వెళ్లినవారు,ఉద్యోగరీత్యా బయట ఉన్నవారికి నోటీసులు అందకపోవడం,మరణించిన వారి పేర్లు జాబితాలో కొనసాగడం వంటి అంశాలను ప్రస్తావించారు.ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా,తండ్రి/భర్త పేరు,ఇంటి నంబర్‌లో తప్పులు ఉన్నాయని తెలిపారు.నోటీసులు అందకపోయినా అందినట్లు నమోదు చేస్తున్నారన్న ఫిర్యాదులపైనా చర్చించారు.బీఎల్ఓలకు ఎస్ఐఆర్ నోటీసుల జారీపై పూర్తి స్థాయిలో శిక్షణ, అవగాహన కల్పించాలని కోరారు.

## ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ





**జవహర్ నగర్, సెప్టెంబర్ 01(వార్తా ప్రభ):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం ఇందిరమ్మ మైనార్టీ మహిళ యోజన పథకం కింద చెక్కుల పంపిణి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్ధిల్ల శ్రీధరుబాబు, చీఫ్ వీఫ్ పట్నం మహేందరురెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రష్ యాదవ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జవహర్ నగర్ మైనారిటీ సంబందించిన జూలేక చెక్కుల పంపిణి కార్యక్రమంలో మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, చంద్రపురి డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరిఅశోక్, గాజ్వేల్ శంకర్, బొబ్బిలి మంజుల, విజయ్ రాయ్, మైనారిటీ అధ్యక్షులు రఫీక్, ఎరగుండ్ల వెంకటేష్, అనంత లక్ష్మి, గండి సునీత, పరుశురాం, రాజుయాదవ్, బిట్టు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు.

## యోగాసనాలలో ప్రతిభ కనబరచిన టి జె పి యస్ విద్యార్థి



**గుంటూరు, సెప్టెంబర్ 1:(వార్తా ప్రభ ప్రతినిధి)** యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు 51 వ ఆంధ్రప్రదేశ్ యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2026 పోటీలను ఈ నెల 29,30 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించిన పోటీలలో తమ కళాశాల (బి కామ్ ద్వితీయ సంవత్సరం) విద్యార్థి శ్రీరామ్ అద్భుతంగా యోగాసనాలు ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. విద్యార్థులు చదువుల్లో చక్కగా రాణించడానికి, జ్ఞాపకశక్తి పెంపుదలకు, శారీరక,మానసిక ఆరోగ్యం అభివృద్ధి కొరకు యోగాసనాలు దోహదపడతాయని, నేటి కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరి జీవితంలో యోగాసనాలు భాగం కావాలని, మానవున్ని సరైన మార్గంలో ప్రయాణింపచేసే దిక్సూచి యోగాసనం అని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కె.వి బ్రహ్మం అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకులు టి వాసుదేవరావు మరియు గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జమ్ము వెంకట సుధీర్ కుమార్ పాల్గొన్నారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు యోగాసనాలలో ప్రథమ చూపి తమ కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.